ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
బుధవారం, 17 సెప్టెంబరు 2025

చరిత్ర మరువని రోజు..
సెప్టెంబరు 17
7





కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడికి వినతిపత్రం అందజేస్తున్న మంత్రి తుమ్మల

గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టండి

- బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయండి
- కేంద్రమంత్రులు రామ్మోహన్, కుమారస్వామికి మంత్రి తుమ్మల వినతి

ఖమ్మం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న తుమ్మల మంగళవారం రామ్మోహన్ నాయుడితో పాటు కేంద్ర భారీపరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కూడా కలిశారు. తొలుత రామ్మోహన్‌నాయుడిని కలిసిన తుమ్మల కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు స్థాపనకు చొరవ తీసుకోవాలని కోరారు. భద్రాద్రి రామలయ దర్శనానికి వచ్చే భక్తులకు ఈ ఎయిర్‌పోర్టు ఉపయోగపడుతుందని వివరించారు. ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు స్పందించి ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం సివిల్‌ఏవిగేషన్ తరుపున ఫీజుబులిటీ సర్వే నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆస్థలం సర్వేలో ఫీజుబులిటీకి అవకాశం లేదని తేలినందున మరోస్థలం రాష్ట్ర ప్రభుత్వం తరుపున ప్రతిపాదన చేశామని, ఇక్కడ కూడా త్వరగా సర్వే నిర్వహించి ఎయిర్‌పోర్టు నిర్మాణంకు చొరవ తీసుకోవాలని కోరారు. భద్రాచలం ప్రముఖ పుణ్యక్షేత్రమని, దేశవ్యాప్తంగా ఈ అలయానికి గుర్తింపు ఉందని, హెవీవాటర్, సింగరేణి, ఐటీసీ బీపీఎల్‌తో పాటు పలు నవభారత్ లాంటి ప్రతిష్టాత్మక పరిశ్రమలు ఈప్రాంతంలో ఉన్నాయని, దేశంలోనే తొలి ఎర్త్ సైన్సు యూనివర్సిటీని కొత్తగూడెంలో ఏర్పాటు చేశామని, పారిశ్రామికంగా, విద్యాపరంగా, పర్యాటకంగా ఈప్రాంతం అబివృద్ధి చెందుతున్నందున గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని ఇందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందన్నారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు అన్ని విధాల సహకరించాలని మంత్రిని కోరారు. అనంతరం ఉక్కుపరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో ఈ అంశంపై సమావేశం ఏర్పాటుచేస్తామని కేంద్రమంత్రి హామి ఇచ్చినట్టు మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరించారు.

ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. తమకు రావాల్సిన బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం తీవ్రజాప్యం చేస్తుండటంతో.. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి సేవలను నిలిపి వేస్తున్నట్టు ప్రకటించాయి. అయితే తొలుత ఆగస్టు 31 నుంచి సేవలు నిలిపివేస్తామని ప్రకటించగా.. ప్రభుత్వం ఆస్పత్రుల యజమానులతో చర్చించి బకాయిలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో నాడు తమ సమ్మె నిర్ణయాన్ని విరమించుకున్నారు. కానీ నెలరోజులైనా బకాయిలు రాకపోవడంతో సేవలను నిలిపివేసేందుకు నిర్ణయించుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.30కోట్లకు పైగానే బకాయిలున్నట్లు సమాచారం కాగా.. ప్రభుత్వ ఆస్పత్రులకు కూడా రూ.5కోట్లకు పైగా బకాయిలున్నట్లు తెలిసింది. ఆయా ఆస్పత్రులకు 15 నెలలుగా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించడం లేదు. ఇక ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ బకాయిలు కూడా 20 నెలల నుంచి రావడం లేదని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి.

ఆగిన ఆరోగ్యశ్రీ

- మంగళవారం అర్ధరాత్రి నుంచి సేవల నిలిపివేత
- బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాల నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో రూ.30కోట్లకు పైగా బిల్లులు పెండింగ్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ పథకం కింద ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 33 ఆస్పత్రులు, ప్రభుత్వ ఆస్పత్రులు 16 వరకు ఉన్నాయి. వీటిలో డయాలసిస్‌తో పాటు 970కిపైగా వైద్య సేవలను నిరుపేదలకు ఉచితంగా అందుతున్నాయి. ఈ పథకాన్ని 2023 డిసెంబరు నాటికి స్వల్ప బకాయిలుండగా తాజాగా రూ.30కోట్లకు పైగా బకాయిలున్నట్లు సమాచారం. గత జనవరిలో నెట్‌వర్క్



ఫైల్

భారీగా బకాయిలున్నాయి..

డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, నెట్‌వర్క్ ఆస్పత్రుల అధినేత



ఆరోగ్యశ్రీ బకాయిలు పెద్దమొత్తంలో పేరుకుపోయాయి. ఒక్కో ఆస్పత్రికి 15నెలకు గాను కనీసం రూ రూ.3కోట్ల నుంచి రూ.4కోట్ల వరకు రావాల్సి ఉంది. ఆపరేషన్లు ఇతర పరికరాలను సరఫరా చేసే సంస్థలకు కూడా బకాయిలకు పెరిగిపోతున్నాయి. ఆ భారాన్ని ఆసుపత్రులు మోయలేకపోతున్నాయి. ప్రభుత్వానికి ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి సేవలను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నాం. కేంద్రం నుంచి ఆయుష్మాన్ భారత్ బకాయిలు వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, జీహెచ్‌ఎస్ బకాయిలు మాత్రం ఏళ్లతరబడి చెల్లించడం లేదు. అందుకే సేవలు నిలిపివేస్తున్నాం.

ఖమ్మం జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ప్రైవేటు ఆస్పత్రులు	:	18
ప్రభుత్వ ఆస్పత్రులు	:	7
అర్హులైన కుటుంబాలు	:	4,11,347
భద్రాద్రి జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ప్రైవేటు ఆస్పత్రులు	:	15
ప్రభుత్వ ఆస్పత్రులు	:	9
అర్హులైన కుటుంబాలు	:	2,93,322

ఆస్పత్రులు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురాగా కొద్దిమొత్తంలో చెల్లించి ఆందోళనను విరమింపజేశారు. ప్రస్తుతం 15నెలలుగా పూర్తి బకాయిలు విడుదల కాకపోవడంతో ఆస్పత్రుల యాజమాన్యాలు సేవలు నిలిపివేయాలన్న నిర్ణయాన్ని తీసుకున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆయుష్మాన్ భారత్ పథకం కూడా ఆరోగ్యశ్రీతో అనుసంధానమయ్యాయి. అంతే కాదు ప్రభుత్వం తాజాగా ఆరోగ్యశ్రీ కింద రూ.10లక్షల వరకు కూడా పెంచింది. చిన్న చిన్న శస్త్రచికిత్సలు కూడా దీని కింద నెట్వర్క్ ఆసుపత్రులు చేయాలి. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కింద చెల్లించే బకాయిలు మాత్రం ఇటీవలే ఒక్కో ఆస్పత్రికి రూ.5లక్షలు, రూ.10లక్షలు చొప్పున విడుదల చేశాయి కానీ రాష్ట్ర ప్రభుత్వ బకాయిలు మాత్రం విడుదల చేయలేదు. బకాయిలు భారీగా పెరిగిపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు సర్కారు తీరుపై పెదవివిరుస్తున్నాయి.

నేడు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

- ఖమ్మంలో జాతీయజెండాను ఆవిష్కరించనున్న డిప్యూటీ సీఎం భట్టి
- కొత్తగూడెంలో పాల్గొననున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ భారతదేశంలో విలీనమైన సెప్టెంబరు 17ను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో బుధ వారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రజాపాలన దినోత్స వాలు నిర్వహించనున్నారు. ఖమ్మం పోలీసుపరేడ్ గ్రౌండ్లో నిర్వహించే ఉత్సవాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొంటారు. ఉదయం 9.30కి ఆయన జాతీయ జెండాను ఎగుర వేయనున్నారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఇక భద్రాద్రి కొత్తగూడెంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని జాతీయజెండా ఎగురవేస్తారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వరంగల్ జిల్లాలో జరిగే వేడుకల్లో పాల్గొంటారు.

తెలుగుతో వెలుగు నింపగా..

- పలు అంశాల్లో గిరి బిడ్డలకు పోటీలు.. ప్రోత్సాహకాలు
- తెలుగుదనంపై మరోసారి ప్రేమను చాటిన పీవో రాహుల్

7

రెండేళ్లయినా..

- బదిలీ కాని జీవో 317 ఉద్యోగి?
- సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్‌గా ఎంపికైనా బాధ్యతలు ఇవ్వని వైనం
- ఎంపిక కాని వారికి అప్పగించడంపై విమర్శలు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఒక ప్రాంతం నుంచి వేరొక ప్రాంతానికి బదిలీ అయిన ఉద్యోగులు వెంటనే రిలీవ్ అయి.. తాము బదిలీ అయిన చోట జాయిన్ కావడం సహజం. కానీ జీవో నెం. 317 ప్రకారం కొత్తగూడెం నుంచి ఖమ్మానికి బదిలీ అయి రెండేళ్ల గడిచినా ఓ ఉద్యోగి విధుల నుంచి రిలీవ్ కాకుండా పాత పోస్టింగ్‌లోనే కొనసాగడం ఉపాధ్యాయుల్లో చర్చనీయాంశంగా మారింది. సర్వశిక్ష అభియాన్‌లో కో ఆర్డినేటర్‌గా ఎంపికైన వారికి మూడేళ్లపాటు ఫారెన్ సర్వీస్ కొనసాగడానికి వీలు ఉంటుంది. ఈ సర్వీస్ పూర్తి అయిన వెంటనే కొత్త ప్రదేశానికి వెళ్లాల్సి ఉంది. ఒక వేళ మరో ఏడాది కాలపరిమితిని పెంచుకోవడానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఉన్నతా అధికారుల వద్ద అనుమతి కోసం ప్రతిపాదనలు పంపాలి. కానీ భద్రాద్రి కొత్తగూడెంలో ఫారెన్ సర్వీస్ పూర్తి అయిన ఓ ఉద్యోగి జీవో నెం. 317 ప్రకారం ఖమ్మం జిల్లాకు వెళ్లాల్సి ఉంది. కానీ ఇంకా కొత్తగూడెం డీఈవో కార్యాలయంలోనే కొనసాగడం సర్వత్రా చర్చకు దారి తీసింది.

విమర్శలకు తావిస్తున్న విద్యాశాఖ తీరు..

జీవో నెం. 317 ప్రకారం బదిలీ అయిన ప్రాంతానికి వెళ్లని ఉపాధ్యాయులపై విద్యాశాఖ చర్యలు తీసుకొన్నప్పటికీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ప్రత్యేకత ఉంది. వాస్తవానికి 2022 లో భద్రాద్రి జిల్లాలో కో ఆర్డినేటర్ పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షల్లో ప్రథమ ర్యాంకు సాధించిన అన్నపురెడ్డిపల్లి ఉపాధ్యాయుడికి ఇంత వరకు పోస్టింగ్ ఇవ్వలేదు. మొదటి ర్యాంకర్ అనేక సార్లు డిఈవో, కలెక్టర్, రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని కో ఆర్డినేటర్‌గా ఎంపికైన ఉపాధ్యాయుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కొత్తగూడెం నుంచి ఖమ్మం జిల్లాకు బదిలీ అయినప్పటికీ ఎందుకు విడుదల చేయడం లేదని, దీని వెనుక ఉన్న గాడ్‌ఫాదర్‌పై ఉపాధ్యాయుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఖమ్మం సర్వశిక్ష అభియాన్‌లో కో ఆర్డినేటర్‌గా ఎంపికైన వ్యక్తి విధుల్లో చేరకపోవడంతో ఆ పోస్టులో మరొక ప్రధానోపాధ్యాయుడిని నియమించారు. అనర్హత కలిగిన వ్యక్తిని కో ఆర్డినేటర్‌గా నియమించి ఖమ్మం జిల్లాకు అర్హత సాధించిన కో ఆర్డినేటర్‌ని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. తక్షణమే జీవో నెం. 317లో బదిలీ అయిన వ్యక్తిని విధుల నుంచి విడుదల చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఫస్ట్ ర్యాంకు తెచ్చుకున్నా పోస్టింగ్ ఇవ్వడం లేదు

బి.రామ్‌కుమార్, కో ఆర్డినేటర్‌గా అర్హత సాధించిన ఉపాధ్యాయుడు



సర్వశిక్ష అభియాన్ 2022 లో నిర్వహించిన కో ఆర్డినేటర్ పరీక్షలో మొదటి ర్యాంకు సాధించినప్పటికీ నాకు భద్రాద్రి జిల్లాలో కో ఆర్డినేటర్ పోస్టు ఇవ్వలేదు. అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది. మా పోస్టులో ఉన్న వ్యక్తి జీవో నెం. 317 బదిలీ కావడం, ఖమ్మం జిల్లాలో కో ఆర్డినేటర్‌గా ఎంపికైనప్పటికీ ఇంత వరకు ఆయనను రిలీవ్ కాలేదు. అన్ని రకాల అర్హతలున్నా. జిల్లాలో ప్రథమ ర్యాంకు వచ్చినా నన్ను కో ఆర్డినేటర్‌గా ఎందుకు నియమించడం లేదు. గతేడాది నుంచి డీఈవో ఆఫీస్ నుంచి ఫోన్ చేసి కాలయాపన చేశారు. తక్షణమే కో ఆర్డినేటర్‌గా అవకాశం ఇవ్వాలి.



చిత్రకూట మండపం వద్ద ఉట్ల పండగ

రామాలయంలో ఆహ్లాదకరంగా ఉట్ల పండగ

రామయ్యను దర్శించిన ఎస్పీ రోహిత్‌రాజు

భద్రాచలం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీ వైష్ణవ కృష్ణాష్టమిని పురస్కరించుకొని భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ఉట్ల పండగను ఆహ్లాదకరంగా నిర్వహించారు. సోమవారం రాత్రి లాలలు, జోలలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించిన అర్చకులు మంగళవారం ముందుగా దర్బారు సేవ నిర్వహించి అనంతరం చిత్రకూట మండపం వద్ద ఉట్ల పండుగ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె దామోదరరావు, పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, దేవస్థానం ప్రధాన అర్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులు (మిగతా 6వ పేజీలో)

అడ్డుకుంటేే.. ఆగుతుందా?

- ఆంధ్రా నుంచి ఇసుక అక్రమ రవాణాకు బ్రేక్ తాత్కాలికమేనా!
- ఏలూరు జిల్లా చింతలపూడిలో 21 ఇసుక లారీలు సీజ్
- అన్నీ తెలంగాణకు చెందిన వాహనాలే!
- వందల సంఖ్యలో వాహనాలతో అక్రమ రవాణా.. పట్టుబడుతున్నవి కొన్నే..

సత్తుపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఏపీ నుంచి తెలంగాణలోని పలు ప్రాంతాలకు సరిహద్దులు దాటి అక్రమంగా రవాణా జరుగుతున్న ఇసుకపై ఏపీ పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలోనే ఈ నెల 4న చింతలపూడి ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 16లారీలను పట్టుకున్నారు. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే మరో ఐదు వాహనాలను కూడా పట్టుకున్నట్టు సమాచారం. ఇలా పెద్ద సంఖ్యలో వాహనాలు పట్టుబడటం ఏపీ సరిహద్దున ఉన్న సత్తుపల్లి నియోజకవర్గంలో కలకలం రేపింది. చింతలపూడి పోలీసులు పట్టుకున్న ఇసుక లారీల సంఖ్య పెద్దదేమీ కాకపోయినా కొద్ది నెలలుగా సత్తుపల్లి, ఎర్రగుంటపల్లి, చాత్రాయి, సత్తుపల్లిలోని కాకర్లపల్లి రోడ్, అవని వెంచర్, జలగం నగర్, మండలంలోని బేతుపల్లి, గంగారం, రేజర్లకు చెందిన కొందరు ఏపీ నుంచి అక్రమంగా ఇసుకను సరిహద్దులు దాటించి సత్తుపల్లి నియోజకవర్గంలో భారీ స్థాయిలో విక్రయిస్తున్నారు. కొద్ది నెలలుగా ఈ ఇసుక వ్యాపారం రూ.కోట్లకు చేరిందని స్థానికులు చెబుతున్నారు.

ఎక్కడి నుంచి ఎక్కడికంటే...

ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వూరు, తాళ్లపూడి తదితర రేవుల నుంచి వందలాది లారీల్లో ఇసుకను ఏపీలోని సరిహద్దు గ్రామాల వరకూ అనుమతులతో రవాణా చేసి అక్కడి నుంచి సత్తుపల్లి నియోకవర్గంలోని పలు మండలాలకు అక్రమంగా తెస్తూ భారీగా అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు, హైదరాబాద్ వరకూ తమ అక్రమ ఇసుక వ్యాపార సామ్రాజ్యాన్ని



ఆంధ్రప్రదేశ్‌లో పట్టుబడిన ఇసుక లారీలు (ఫైల్)

విస్తరించారనే ఆరోపణలున్నాయి. ఇసుక అక్రమ రవాణాకు కొత్తగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేను కూడడా అక్రమార్కులు వదల్లేదు. ఇప్పటికీ వారు ఇసుక అక్రమ వ్యాపారం కొనసాగిస్తూనే ఉన్నారు.

పరిమితికి మించి ఇసుక లోడ్

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారు అనుమతులు 20 టన్నులకు మాత్రమే ఉంటే లారీ, టిప్పర్‌లలో 40 టన్నులు, 30టన్నులకు పర్మిట్ ఉంటే 60టన్నులపైగా ఓవర్ లోడ్ చేసి తరలిస్తున్నారు. అయినా రాష్ట్రంలోకి అనుమతుల్లేకుండా వచ్చిన వాహనాల వైపు ఇక్కడి అధికారులు కన్నెత్తి చూసే పరిస్థితి లేదు.

వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'

ఏపీలోని పలు ప్రాంతాల నుంచి సత్తుపల్లి నియోజకవర్గంలోకి ఇసుక అక్రమ రవాణా చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమార్కుల వ్యవహారాలను 'ఆంధ్రజ్యోతి' (మిగతా 8వ పేజీలో)

తహసీల్దార్లకు ప్రకృతి విపత్తుల పరికరాల అందజేత

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల నిర్వహణకు వినియోగించే రక్షణ సామగ్రిని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తహసీల్దార్లకు అందజేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన విప త్తు సమయాల్లో రక్షణకు ఉపయోగించే సామగ్రిని వారికి అందజేసి.. వీటిని భద్రపరిచి, విప త్తు సమయంలో వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ, కలెక్టరేట్ ఏవో కె.శ్రీనివాసరావు, తహసీల్దార్లు తహసీల్దార్లు రాంప్రసాద్, అరుణ, శ్వేత, కలెక్టరేట్ పర్యవేక్షకులు శర్మ పాల్గొన్నారు.



ఓ తహసీల్దార్‌కు సామగ్రి అందజేస్తున్న కలెక్టర్

నేడు సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ

- ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో కార్యక్రమం
- హాజరవనున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ

ఖమ్మం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతిప్రతినిధి):తెలంగాణ రైతాంగసాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ బుధవారం ఖమ్మంలో జరగనుంది. సాయంత్రం 5గంటలకు భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే ఈ సభకు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుదర్శన్ హాజరవుతారని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులు ప్రతీ అంశాన్ని నేర్చుకోవాలి

» ఐటీడీఏ పీవో రాహుల్



మేళాను తిలకిస్తున్న పీవో, అధికారులు

భద్రాచలం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతీ అంశాన్ని నేర్చుకోవాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. మంగళవారం భద్రాచలంలోని గిరిజన భవనంలో ఏర్పాటు చేసిన టీఎల్ఎం మేళాను పీవో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులలో దాగి వున్న ప్రతిభా పాటవాలను వెలికితీయటంతో పాటు నూతన అంశాల ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. గత సంవత్సరం 228 పాఠశాలల్లో గుణాత్మక విద్య అందించటానికి ప్రాథమిక నైపుణ్యాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉద్దీపకం వర్క్‌బుక్ రూపొందించటంతో 92 శాతం విద్యార్థులు సులభంగా అన్ని అంశాలను, పదాలను నేర్చుకున్నారన్నారు. టీఎల్ఎం మేళాలో తెలుగు, గణితం, ఆంగ్లంలో సబ్జెక్టుల వారీగా ఎంపికైన ఉపాధ్యాయుల బృందానికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజ్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మణెమ్మ, విజయలక్ష్మి, ఏసీఎంవో రమేష్ ఏటీడీవోలు అశోక్‌కుమార్, చంద్రమోహన్, రాధమ్మ, ఏవోలు నారాయణ రెడ్డి, కృష్ణార్జున, విశ్రాంత ఏసీఎంవో తెల్లం రమణయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ఐక్యతే సమస్యల పరిష్కారానికి మార్గం



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్మికవర్గ ఐక్యతా పోరాటమే ఏకైక మార్గమని, భద్రాచలం డిపో కార్మికులు సాధించిన విజయం కార్మికవర్గ ఐక్యతకు విజయం సాధించడానికి నిదర్శనమని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి అన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని వి.రామయ్య స్మారక భవనం వద్ద గుర్రం రామారావు అధ్యక్షతన ఏర్పాటైన ఎస్‌డబ్ల్యూఎఫ్ 47వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అల్లం శెట్టి వెంకటేశ్వర్లు శ్వేతారుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భద్రాచలం డిపోలో కార్మికులు అపూర్వ ఐక్యత కనబరిచి పోరాడి తమ సమస్యలు పరిష్కరించుకున్నారని,వారి పోరాటానికి జేజేలు పలుకుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు ఖమ్మం రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు గుండు మాధవరావు, పిట్టల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షటిల్ పోటీలకు వైరా చిన్నారులు

వైరా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-11 షటిల్ పోటీలకు వైరాకు చెందిన ఇద్దరు చిన్నారులు ఎంపికయ్యారు. వైరా న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాలకు చెందిన పదేళ్ల ఆదర్శ్, మధు విద్యాలయానికి చెందిన ఎనిమిదేళ్ల యోచన్ శ్రేయాన్‌లు తమ సామర్థ్యాన్ని చాటి, త్వరలో హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మంగళవారం ఈ చిన్నారులను ఇండోర్ షటిల్ స్టేడియంలో షటిల్ క్రీడాకారుడు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ అయిన బొర్రా రాజశేఖర్, సీనియర్ క్రీడాకారులు శ్రీరామనేని విజయభాస్కర్, సురేష్, శ్రీనివాసరావు, గోపాల్, కోచ్ షేక్.అంజద్ పాషా అభినందించారు.



శ్రేయాన్, ఆదర్శ్‌లను అభినందిస్తున్న బొర్రా రాజశేఖర్

పత్తి చేలు.. వర్షార్పణం

» రోజూ పడుతున్న వర్షాలతో రాలుతున్న పూత, కాత

» ఆందోళనలో పత్తి రైతులు

తల్లాడ/చంద్రుగొండ, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): అధికవర్షాలతో చేతికొచ్చే తరుణంలో పత్తిపంట దక్కకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. గతనెల రోజులుగా కురుస్తున్న వర్షాలు వల్ల కాయ, దూది పింజ తీసే దశలో ఉన్న పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. అనేక వ్యయ ప్రయాసలకోర్చి సాగు చేసిన పత్తిపంట దిగుబడులు గణనీయంగా తగ్గుతుండడంతో పెట్టుబడులుకూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఈఏడాది వానాకలం సీజన్‌లో తల్లాడ మండలంలో అత్యధికంగా 9500 ఎకరాల్లో పత్తిసాగు చేశారు. రెండేళ్ల నుంచి మిర్చి దిగుబడులు తగ్గి, ధర లేకపోవడంతో నష్టపోయిన రైతులు ఏడాది మిర్చికి ప్రత్యామ్నాయంగా పత్తిసాగు వైపు మొగ్గు చూపారు. గత ఏడాదితో పోలిస్తే మండలంలో అదనంగా నాలుగువేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పత్తి సాగుకు అవసరమైన పొలం కౌలుకు తీసుకున్న రైతులు ఎకరానికి రూ.25వేలు కౌలు చెల్లించారు. మే నెలలో అకాల భారీవర్షాలు కురిసి సాగుకు అదునుగా ఉండడంతో ముందుస్తుగానే పత్తిసాగు చేశారు. పత్తి సాగు కోసం ఇప్పటి వరకు ఎకరానికి రూ.50వేలకు పైగా పెట్టబడులు పెట్టారు. ప్రస్తుతం పత్తి పైరు పూత,కాత, పింజ దశలో ఉన్నాయి. సుమారు నెలరోజులుగా కురుస్తున్న భారీవర్షాలతో పత్తి పైర్లు ఎర్రబారిపోయాయి. పత్తి పైరులో తమేను ఇంకింప చేసి పోషకాలనందించే యూరియా దొరక్కపోవడం వల్ల రైతుల పరిస్థితి మూ లిగే నక్కపై తాటిపండు పడిన చందంగా మారింది. పత్తిలో పూత రాలిపోవడం, కాయలు నల్లబారి కుళ్లిపోతున్నాయి. కాయలు పగిలిన దూదింపింజలు గిడసబారి పత్తి నాణ్యతను కోల్పోయింది. ఎకరానికి మూడు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. పక్వానికి వచ్చిన పత్తి తీసేందుకు కూలీలకు క్వింటాకు రూ.1100ల మేరకు ఖర్చవుతుంది. ఈదశలో తడిచిన గిడసబారి నాణ్యత లేకపోవడంతో మార్కెట్‌లో పత్తి ధర క్వింటాకు రూ.5వేలు ధర పలకుతుంది. పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గడంతో పత్తి రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.



తల్లాడలో ఎర్రబారిన పత్తి పైరు

చంద్రుగొండ: నిత్యం కురుస్తున్న వర్షాలతో పత్తి సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొనే పరిస్థితులు నెలకున్నాయి. అతివృష్టి కారణంగా పత్తి చెట్లుకు ఉన్న పూత, పిందె రాలిపోతుండగా కాచిన కాయలు సైతం కుళ్లిపోతున్నాయి. పైరు వేపుగా పెరిగి ప్రస్తుతం ముమ్మర పూత, కాత దశలో ఉంది. అయితే ఈ సమయంలో వర్షాలు తగ్గుముఖం పట్టకపోవటంతో పూత, పిందె మాడిపోతుంది. ఈ దశలో వర్షాలు వెనుకాడితేనే కాపు నిలబడి దిగుబడి పెరుగుతుందని లేదంటే తీవ్రగా నష్టలు చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆందోళనలో ఉన్నారు. దీనికి తోడు గులాబి రంగు పురుగు వెంటాడుతుంది. క్రిమిసంహార మందులు పిచికారీ చేసినా నిత్యం వర్షాలు కారణంగా ఉపయోగం ఉండటంలేదని పలువురు రైతులు తెలిపారు. చీడ పీడల సమస్య అయితే క్రిమిసంహార మందులతో పంటను కొంతవరకు కాపాడుకోవచ్చు కానీ ప్రకృతి సహకరించకపోతే నష్టాలు మూట కట్టుకోవాల్సిందేనని పలు గ్రామాల రైతులు ఆవేదన చెందుతున్నారు.

దిగుబడి వచ్చే పరిస్థితి లేదు

కామసాని కృష్ణారెడ్డి రైతు నారాయణపురం



14 ఎకరాల్లపత్తి సాగు చేశాం. ఇందులో 4 ఎకరాల సొంతం. మరో 10 ఎకరాలు కౌలు తీసుకుని పత్తిసాగు చేశాం. ఎకరానికి రూ.25వేలు కౌలు చెల్లించి పత్తిసాగు కోసం ఎకరానికి రూ.50వేలు పెట్టుబడులు పెట్టాం. పంట చేతికొచ్చే సమయంలో అధికవర్షాలతో పైరు ఎర్రబారి కాయలు కుళ్లిపోయి పింజ తడిచి నల్లబారి ఎకరానికి 3 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్తితి లేదు. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

మిర్చి వద్దని పత్తి వైపు మొగ్గాం

నిజాంపట్నం వెంకటేశ్వర్లు, రైతు, రావికంపాడు



మిర్చి పంటను నమ్మితే గత మూడేళ్లుగా నష్టాలే మిగిలాయని, ఆ నష్టాల నుంచి బయట పడేందుకు పత్తి సాగు చేశా. ఈ పంట నష్టాలు మిగిల్చే పరిస్థితులు ఉన్నాయని తెలిపాడు. అష్ట కష్టాలకు ఓర్చి పండిచిన పంట చేతికి వచ్చేదశలో ప్రకృతి పగపట్టి నట్లు నాశనం అవుతుండటం బాధ కలిగిస్తుందని ఆవేదన చెందాడు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే ఉపేక్షించం

» కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ రాజేందర్



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రొఫెసర్ రాజేందర్

ఖమ్మంఖానాపురంహవేలీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పరీక్షల నిర్వహణలో నిబంధనలు పాటించాలని, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే ఉపేక్షించేది లేదని, చర్యలు తప్పవని కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ అన్నారు. మంగళవారం నగరంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో జరుగుతున్న ఎస్‌డీఎల్‌సీ దూరవిద్య డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట అదనపు పరీక్షల నిర్వహణ అధికారి ప్రొఫెసర్ ఎస్ నరసింహచారి, కాలేజీ డెవలప్మెంట్ కౌన్సిల్ (సిడిసి) డీన్ ప్రొఫెసర్ పి. వరలక్ష్మి, కేయూ క్యాంపస్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్ మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. అమరవేణి, ఏ. ఆర్ కోల శంకర్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రవికుమార్, ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం పామాయిల్

విత్తనాలపై దర్యాప్తు జరపాలి

వైరా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విదేశాల నుంచి దిగుమతి అయిన నాసిరకం పామాయిల్ విత్తనాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని, పామాయిల్ రైతుల సమగ్ర పరిష్కారానికి తోడ్పాటునందించాలని తెలంగాణ పామాయిల్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలోని సూర్జిత్ భవన్‌లో అఖిలభారత కిసాన్‌సభ జాతీయ నాయకులకు వినతిపత్రం సమర్పించారు. కిసాన్ సభ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ దవాలే, విజు కృష్ణన్‌ను రైతు పామాయిల్ సంఘం నాయకులు కలిశారు. నాసిరకం పామాయిల్ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించేలా తోడ్పాటునందించాలని కిసాన్‌సభ కోరారు. తెలంగాణ పామాయిల్ రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరి మహేశ్వర్‌రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్, ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, శోభన్, జంగారెడ్డి, శ్రీనివాసులు, సోమయ్య, వెంకట్, చందునాయక్ పాల్గొన్నారు.



ఢిల్లీలో అఖిలభారత కిసాన్‌సభ నాయకులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

దరఖాస్తుల ఆహ్వానం

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాలుగు సంవత్సరాల కోర్స్ బీఎస్సీ నర్సింగ్‌లో చేరే విద్యార్థులకు శ్రీ కాలోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సత్తుపల్లి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కేబీ.జ్యోత్స్న మంగళవారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఈపీసెట్ క్వాలిఫై అయిన విద్యార్థులు ఈనెల 30వ తేదీ సాయంత్రం 5గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈ సదవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఆమె కోరారు.

భద్రాద్రి జిల్లా ఈఎంఈ కో ఆర్డినేటర్‌గా సతీష్



చుంచుపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్ (ఈఎంఈ) 108,102,1962 వాహనాల కో ఆర్డినేటర్‌గా కుర్మ సతీష్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కొమరంభీం ఆసీఫాబాద్ జిల్లాలో విధులు నిర్వహిస్తూ జిల్లాకు బదిలీపై వచ్చారు.

రామాలయంలో

ఆహ్లాదకరంగా ఉట్ల పండగ

(5వ పేజీ తరువాయి)

ఉప ప్రధాన అర్చకుడు అమరవాది శ్రీనివాస రామానుజం పాల్గొన్నారు.

రామయ్యను దర్శించిన ఎస్పీ రోహిత్‌రాజు

భద్రాచల రామయ్యను ఎస్పీ రోహిత్‌రాజు మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా దేవస్థానం తరపున కండువ, స్వామి వారి ప్రసాదాన్ని దేవస్థానం ఈవో కె.దామోదర రావు అందజేశారు. అంతకు ముందు ఎస్పీ రోహిత్‌రాజుకు ఆలయ ప్రాశస్త్యాన్ని వైదిక సిబ్బంది వివరించారు. దేవస్థానం పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్ పాల్గొన్నారు. అలాగే నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దంపతులు, రామయ్యను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా సిద్దిపేట గురునందన సరస్వతి పీఠానికి చెందిన మాధవానంద సరస్వతి స్వామి రామయ్యను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శ్రీసీతారామచంద్రస్వామివారు

ద్విచక్ర వాహనాన్ని

ఢీకొట్టిన బొగ్గు లారీ

ఒకరి మృతి

చుంచుపల్లి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ వ్యక్తిని బొగ్గులారీ ఢీకొట్టటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కొత్తగూడెం హనుమాన్ బస్తీకి చెందిన కలాతురి వేణుగోపాల్(49) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. సాయంకాలం రుద్రంపూర్‌కు తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. కూరగాయాలు తీసుకొని వస్తున్న క్రమంలో త్రీఇంక్లైన్ ప్రాంతం వద్ద వెనక నుంచి వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న వేణుగోపాల్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. అంబులెన్స్‌లో సర్వజన ఆసుపత్రికి తరలించగా, మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను, డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుడి భార్య స్రవంతి ఫిర్యాదు మేరకుసీఐ ప్రతాప్ కేసు నమోదు చేశారు.

రైలు కింద పడి యువకుడి మృతి

ఖమ్మంక్రైం, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. ఘటన మంగళవారం ఖమ్మం నగర పరిధిలో జరిగింది. సుమారు 26ఏళ్ల యువకుడు ఖమ్మం రైల్వేస్టేషన్ యార్డు సమీపంలో ట్రాక్‌పై మృతి చెందాడని సమాచారం రావడంతో జీఆర్పీ పోలీసులు వెళ్లారు. ఎలాంటి ఆధారలు లేకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు.

శిక్షణ కేంద్రంగా మారిన కేఎంసీ

» ఇతర శాఖలకు ఉచితంగా సమావేశ మందిరాలు

» పట్టించుకొని కేఎంసీ పాలకవర్గం



కేఎంసీలో నిర్వహిస్తున్న ఐసీడీఎస్ శిక్షణ

ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): కేఎంసీ కార్యాలయాన్ని ఇతర విభాగాల శిక్షణలకు ఇవ్వటంపై విమర్శలు వెలువడుతున్నాయి. ఖమ్మం నగర ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు పరిపాలన సౌలభ్యం కోసం నాలుగేళ్లకితం కేఎంసీభవనాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీ ఫ్లోర్‌లో ఒక సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేశారు. కేవలం కేఎంసీ పరిపాలన, కార్పొరేటర్లు సమావేశాలకు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. కానీ ఇటీవల ఇతర ప్రభుత్వశాఖలకు కేఎంసీ కార్యాలయం సమావేశ మందిరం ఓఅవకాశంగా మారింది. కనీసం విద్యుత్ బిల్లులు కూడా అడగక పోవటంతో ప్రభుత్వశాఖలు కేఎంసీ కార్యాలయాల్లో తమ సమావేశాలు నిర్వహించుకునేందుకు క్యూకడుతున్నాయి. ఒకటిరెండు రోజులు కాదు ఏకంగా మూడు నుంచి వారం రోజుల శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. 70 నుంచి 100మంది వరకు ఇతరశాఖల ఉద్యోగులు వస్తున్నారు. కేఎంసీ కార్యాలయానికి ఎవ్వరు వస్తున్నారో ఎందుకు వస్తున్నారో తెలియని పరిస్తితి ఏర్పడింది. ఏసీలు, విద్యుత్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లు,లిఫ్టు నుంచి మరుగుదొడ్ల నిర్వాహణ వరకు కేఎంసీకి అదనపు నిర్వాహణగా మారింది. పాలకవర్గం జోక్యం చేసుకొని కేవలం కేఎంసీ పరిపాలన కోసమే కార్యాలయాన్ని వినియోగించాలని కార్పొరేటర్లు సూచిస్తున్నారు.

నేపాల్‌లో తిరుగుబాటుకు అనేక కారణాలు

» సెప్టెంబరు 17 తెలంగాణ విద్రోహ దినమే

» సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): నేపాల్ దేశంలో ప్రజా తిరుగుబాటుకు అనేక అంతర్గత, బాహ్యకారణాలు ఉన్నాయని ఏఒక్క అంశానికి ముడి పెట్టలేమని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు.నేపాల్‌లో అంతర్గతంగా పేదరికం, నిరుద్యోగం, రాజకీయ అస్థిరత కారణాలు కాగా బాహ్యంగా దక్షిణాసియాలో అమెరికా యుద్ధ ప్రభావం ఉందని వివరించారు. మంగళవారంరాత్రి రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. దక్షిణాసియాలో పెరుగుతున్న చైనా ప్రభావాన్ని నియంత్రించటానికి డీప్‌స్టేట్స్‌ఆఫ్ అమెరికా యూరోపియన్ యూనియన్ కార్పొరేటర్ ప్రయోజనాల కోసం ఎన్జీవోలను రెచ్చగొట్టి తిరుగుబాటును ప్రోత్సహించిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందని వేలాది మంది అమరులయ్యారని రంగారావు పేర్కొన్నారు. సెప్టెంబరు17 ముమ్మాటికి విద్రోహ దినోత్సవమే అన్నారు. ఆవుల అశోక్, ఝాన్సీ, శిరోమణి, ప్రతాపనేని శోభ, కే శ్రీను, ఆజాద్, రాకేష్, లక్ష్మణ్, వెంకటేష్, లెనిన్, సత్తార్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మంగళవారం తీర్పు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ టెంపుల్ ఏరియాలో 2022లో బడికల సందీప్ అలియాస్ బాబీ అనే వ్యక్తిపై పల్లం సాయికుమార్ అలియాస్ జగడం సాయికుమార్ అనే రౌడీషీటర్ ఉద్దేశ పూర్వకంగా దాడిచేసి హత్య చేశాడు. ఈ ఘటనలో ఫిర్యాదు అందుకున్న కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి గౌరవ కోర్టు వారికి తగిన ఆధారాలను సమర్పించారు. కేసు నమోదు సమయంలో కొత్తగూడెం త్రీటౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉన్న ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య విచారణ అధికారిగా వ్యవహరించారు. అనంతరం ప్రస్తుత త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ ఇట్టి కేసు విచారణను ముందుకు సాగించారు. ఈ కేసులో వాదోపవాదాలు విన్న అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిందితుడు పల్లం సాయికుమార్‌కు 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ కేసులో నిందితుడు సాయికుమార్‌కు శిక్షపడే విధంగా కృషి చేసిన పోలీస్ అధికారులు అబ్బయ్య, శివప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీడీ లక్ష్మి, కోర్టు లైజెనింగ్ అధికారి వీరబాబు, కానిస్టేబుల్ హేమీలాల్‌ను జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు.

కొత్తగూడెంలో ఎన్ఐఏ బృందం విచారణ!

» సామాజిక మధ్యమాల్లో ఓ సామాజిక వర్గం పోస్టుపై యువకుడి స్పందన

» విశాఖ పట్నంలో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కొత్తగూడెంలో విచారణ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెంలో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) విచారణ బృందం అధికారులు, పోలీసులు రావడం చర్చనీయాంశమైంది. మంగళవారం కొత్తగూడెం పట్టణంలోని ఓ కాలనీలో సుమారు నాలుగు వాహనాల్లో వచ్చి గోప్యంగా దర్యాప్తు చేపట్టారు. సామాజిక మధ్యమాల్లో దేశ భద్రత విషయంలో ఏపీలోని విశాఖపట్టణానికి చెందిన ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి పెట్టిన పోస్టుకు కొత్తగూడేనికి చెందిన ఓ సామాజిక వర్గానికి చెందిన మైనర్ యువకుడు కామెంట్ పెట్టాడు. దానిపై సదరు వ్యక్తి కొత్తగూడెం యువకుడిపై అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అది దేశభద్రతకు సంబంధించిన అంశం కావడంతో ఎన్ఐఏ రంగంలోకి దిగినట్టు సమాచారం. ఎన్ఐఏ బృందం కొత్తగూడెంలోని యువకుడి ఇంటికి వచ్చి అతడితో పాటు, కుటుంబ సభ్యులతో మాట్లాడినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో వారు కొత్తగూడేనికి చెందిన ఆ మైనర్‌కు ఏదైనా అసాంఘిక శక్తులతో సంబంధాలున్నాయా? అతడి ప్రవర్తన, కుటుంబం పరిస్థితేంటి? అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. అయితే ఎన్ఐఏ బృందం ముందుగానే భద్రాద్రి జిల్లా పోలీసులకు సమాచారం అందించి, ఆ తర్వాత విచారణ చేపట్టిందని, గంట పాటు యువకుడి నుంచి వివరాలు సేకరించి వెళ్ళిపోయిందని సమాచారం. ఆ తర్వాత అదే బృందం జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ విచారణ చేస్తున్నట్టు తెలిసింది.

ధన్ బాద్‌లో చోరీ

దర్యాప్తు చేస్తున్న కొత్తగూడెం టూ టౌన్ పోలీసులు

చుంచుపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధన్‌బాద్ గ్రామ పంచాయతీలో దొంగలు నగదుతో పాటు సామగ్రిని దొంగిలించారు. ఈ ఘటన మంగళవారం జరిగింది. బాధితుడు బి.శంకర్ వివరాలు ప్రకారం.. రోజు వారిలాగే ఉదయం షాప్ వద్దకు రాగ తాళాలు పగలగొట్టి ఉంది. అందులో ఉన్న రూ.2వేల నగదుతో పాటు సామాన్లను దొంగలెత్తిపోయారు. గతంలో ఏడుసార్లు షాపులో దొంగలు పడ్డారని, న్యాయం చేయాలని కోరుతూ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కొత్తగూడెం టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గణేష్‌పాడు పాఠశాల ఆవరణలో క్షుద్రపూజల ఆనవాళ్లు !

దమ్మపేట,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): గణేష్‌పాడు పాఠశాల ఆవరణలో ముగ్గులు వేసి పసుపు, కుంకుమ, నిమ్మకాలు పెట్టి క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు ఉండటంతో ఆ గ్రామస్థులు ఆందోళన చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గణేష్‌పాడు పాఠశాల వరండాలో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు ఉండటంతో పాఠశాలకు వచ్చిన సిబ్బంది, విద్యార్థులు భయపడి గ్రామస్థులకు సమాచారమిచ్చారు. గ్రామస్థులు పాఠశాలకు చేరుకొని పరిశీలించి.. పాఠశాల వరండాను నీటితో శుభ్రం చేశారు. కొందరు వీటిని క్షుద్రపూజలుగా అభివర్ణిస్తుండగా.. మరికొందరు ఆకతాయిల చేష్టలని కొట్టిపారేస్తున్నారు. ఈవిషయమై పలువురు గ్రామస్థులు దమ్మపేట పోలీసులకు సమాచారమిచ్చి.. విచారణ జరిపి ఈ పనిచేసిన వారిని గుర్తించి చర్యలు చేపట్టాలని కోరారు.

చరిత్ర మరువని రోజు సెప్టెంబరు 17

తెలంగాణ చరిత్ర మరువని రోజు 1948 సెప్టెంబరు 17. అది నిజాం నిరంకుశత్వం తల వంచిన రోజు. రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు. నాటి రెండు కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడిన పర్వదినం. ఈ నేలపై త్రివర్ణపతాకం ఎగిరిన రోజు. అంతటి ఘన చరిత్ర కలిగిన ఈ రోజుపై ఇప్పుడు వివాదాలు నడుస్తున్నాయి. ఆ వివాదాల సంగతి పక్కన పెడితే నిజాం రాచరిక పాలన ముగిసి, హైదరాబాద్ రాజ్యం భారతప్రభుత్వంలో కలిసిన ఆ రోజు వెనుక అనేక ఘటనలు ఉన్నాయి. అందులో కొన్ని అంశాలు, ప్రముఖుల అభిప్రాయాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి)



ఈ ఘట్టానికి ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ

తెలంగాణ చరిత్రలోనే మరచిపోలేని సెప్టెంబరు 17. ఈ ఘట్టంలో ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ. 'మజ్లిస్ ఎ ఇత్తేహాద్ ఉల్ ముస్లిమీన్' నాయకుడు. ఆయన స్వస్థలం మరఠ్వాడాలోని ఉస్మానాబాద్ జిల్లా లాతూర్. అలీగఢ్‌లో న్యాయ శాస్త్రం అభ్యసించిన అనంతరం హైదరాబాద్‌లో కొంతకాలం వకీలు మహమ్మద్ అలీ ఫాజిల్ దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. తర్వాత సొంతూరుకు వెళ్లిన అతను మజ్లిస్ స్థానిక నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. యావదాస్తిని సంఘానికి రాసిచ్చి నాయకుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించాడు. కొద్దిరోజులకే సంస్థ పగ్గాలు చేపట్టాడు. సమయస్ఫూర్తి, వాగ్ధాటితో సామాన్యులను ఆకట్టుకున్న రజ్వీ నిజాం ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు. రజాకార్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. హింసాత్మక ఘటనలకు కారకుడయ్యాడు. పోలీసు చర్య అనంతరం రజ్వీని భారత సైన్యం అరెస్టుచేసి తిరుమలగిరి సైనిక కారాగారంలో నిర్బంధించింది. 1957, సెప్టెంబరు11న విడుదలయ్యాడు. అదే నెల18న నగరం నుంచి ముంబైకు, అక్కడి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. కరాచీలో ఒక అనామకుడిగా జీవనం సాగిస్తూ న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టాడు. ఒకనాడు ఈ నేలను శాసించాలనుకున్న ఇత్తేహాదుల్ సారథి 1970, జనవరి15న ఓ సాధారణ వ్యక్తిగా కన్నుమూశాడు.

నిజాం ప్రధానిపై రజాకార్ల దాడి

నిజాం నిరంకుశ పాలనలో సామాన్యుల మానప్రాణాలను హరించిన రజాకార్లు నిజాం ప్రధాని మీదా దాడి చేయడం కొంత మందికే తెలుసు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఓ ఆస్పత్రి ఆవరణలో తలెత్తిన ఘర్షణలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న కాంక్షతో కొంతమంది రజాకార్లు ఆనాటి ప్రధాని అధికారిక నివాసం షా మంజిల్(ప్రస్తుతం రాజ్‌భవన్)ను ముట్టడించారు. లోపల గృహోపకరణాలకు నిప్పుపెట్టారు. అంతటితో ఆగక ప్రధానమంత్రిపై సైతం దాడికి పాల్పడ్డారని మందుముల నర్సింహారావు జ్ఞాపకాల్లో ప్రస్తావించారు.

దక్కన్ రేడియోలో స్వాతంత్ర్య ప్రకటన

భారత ఆర్మీ 1948, సెప్టెంబరు18న నగరానికి చేరింది. అంతకు ఒకరోజు ముందు సెప్టెంబర్ 17న ఖాసీం రజ్వీ హైదరాబాద్‌లో నరమేధానికి వ్యూహం పన్నాడు. ఈ విషయం తెలిసి ఉస్మానాబాద్ కలెక్టర్ మహమ్మద్ హైదర్ ఆనాటి నిజాం పోలీసు ఉన్నతాధికారి నవాబ్ దీన్‌యార్‌జంగ్ దగ్గరకు పరుగుతీశాడు. ఇరువురు ఫోన్‌ద్వారా రజ్వీకి నచ్చజెప్పి కల్లోలాన్ని ఆపించారు. ఈ విషయాన్ని మహమ్మద్ హైదర్ జ్ఞాపకాల్లో రాశారు. అంతకు ముందురోజే సైన్యాధ్యక్షుడు ఎల్.ఇద్రూస్ నిజాంను కలిసి సైన్యాన్ని ప్రతిఘటించడం వల్ల మరింత ప్రాణనష్టం మినహా మరేమీ లేదని విన్నవించాడు. దీంతో సెప్టెంబరు17న మొదట ఖాసీం రజ్వీ ఖైరతాబాద్‌లోని దక్కన్ రేడియో ద్వారా తన ఓటమిని అంగీకరించాడు. ఆ తర్వాత కేఎం మున్షీతో కలిసి దక్కన్ రేడియోకు చేరుకున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్... భారత సైన్యాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొన్ని వందల ఏళ్ల రాచరిక పాలన నుంచి ఈ నేలకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంబురాలు చేసుకున్నారు. నగర వీధుల్లో జాతీయ జెండా ఎగరేశారు.



భయంతో ఆస్తులమ్మారు

పోలీసు యాక్షన్‌కు వారం ముందు 'బక్రీదుకు గొర్రెలను కాదు, హిందువుల తలలు నరుకుతాం. వాళ్ల రక్తంతో హోలీ ఆడతాం' అని రజాకార్ నాయకుడు ఖాసీం రజ్వీ ప్రకటించినట్లుగా నగరమంతా వదంతులు వ్యాపించాయి. దాంతో హిందువులంతా భయంతో ఆస్తిపాస్తులు అమ్ముకొని బతికినన్నాళ్లు అయినా ఆనందంగా జీవించాలని విందులు చేసుకున్నారు. అదే సమయంలో భారత సైన్యం ప్రవేశించడంతో నిజాం లొంగిపోయాడని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ట్యాంకులు, వాహనాలకు పూలమాలలు వేసి, భారత జవానులకు లడ్డూలు తినిపిస్తూ సంబురాలు చేసుకున్నారు. ముస్లింలంతా రజాకార్లు కాదు. ఆ సమయంలో రజాకార్ల దాడినుంచి ఎంతోమంది హిందువులను ముస్లింలు కాపాడారు. ఈ విషయాలన్నీ ప్రత్యక్ష సాక్షి మా అక్కచెప్పగా నాకు తెలిశాయి.

- పరవస్తు లోకేశ్వర్, నగర చరిత్ర పరిశోధకుడు


పోరాట చరిత్రను వక్రీకరించొద్దు



నిజాం వ్యతిరేక, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రతో సంబంధం లేని వాళ్లు విమోచనం అంటూ రాద్ధాంతం చేయడం సరికాదు. ఆ మహత్తర పోరాటంలో ప్రాణాలకు తెగించి మరీ పోరాడిన మేమంతా బతికుండగానే ఈ నేల చరిత్రను వక్రీకరిస్తున్నారు. త్యాగాలను అవమానిస్తున్నారు. రాజకీయ ఎత్తుగడలో భాగంగానే నాలుగేళ్లుగా విమోచనం పాటెత్తుకున్నారు. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టుల సాయుధ పోరాటం వల్లే హైదరాబాద్ సంస్థానం భారత ప్రభుత్వంలో విలీనమైందనేది వాస్తవం.

- కందిమళ్ల ప్రతాపరెడ్డి, కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్

కమ్యూనిస్టులకు ఆయుధాలు అందించా



నాది భూస్వామ్య కుటుంబమే అయినా, నిజాం వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నాను. అప్పట్లో హెచ్‌ఎస్‌సీ ప్రీ ఫైనల్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులనే వార్షిక పరీక్షలకు పంపేవారు. దీనికి వ్యతిరేకంగా ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ పెద్ద ఉద్యమమే లేవనెత్తింది. అందులో నేనూ పాల్గొన్నాను. అలా మగ్దూం, జావెద్ రజ్వీ, సీహెచ్ రాజేశ్వరరావు, రాజ్‌బహదూర్ గౌర్ లాంటి కమ్యూనిస్టు నాయకులతో పరిచయం ఏర్పడింది. నిజాం వ్యతిరేక పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులకు ఎన్నో సార్లు మందుగుండు సామగ్రి, తుపాకులు లాంటి ఆయుధాలు రహస్యంగా అందించాను. కొన్నాళ్లు రహస్య జీవితం గడిపాను. కమ్యూనిస్టు పార్టీ చైతన్యంతో వారసత్వంగా వచ్చిన వందల ఎకరాల భూమిని పంచాను.

- మహ్మద్ ఖాజా మొయినుద్దీన్, నిజాం వ్యతిరేక పోరాటయోధుడు, 99ఏళ్లు





విముక్తి పోరాటం.. సాయుధ సమరం

రైతాంగ సాయుధ పోరుకు స్ఫూర్తిగా నిలిచిన సర్వారం, జామ్లతండా గ్రామాలు

పోరాట యోధుడు కంగల బుచ్చయ్య సేవలు చిరస్మరణీయం



రజాకార్ల అలజడిలో సాయుధ పోరాట నేతలు తలదాచుకున్న బావి ఇదే..

కోయగూడెంలో సాయుధ పోరాట యోధుడు కంగల బుచ్చయ్య స్మారక స్థూపం

బ్రిటీషు కాలం నాడు వేసిన రైల్వేట్రాక్

దివంగత మాజీ ఎమ్మెల్యే కంగల బుచ్చయ్య, బుచ్చమ్మ దంపతులు (ఫైల్)

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రులు అలజడులు... రజాకార్ల నుంచి ఏ రూపంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంతో వణికిన రోజులవి. బూట్ల చప్పుళ్లు వినిపిస్తే చాలు కీచురాళ్లు సైతం కిమ్మనకుండా నోరు మూసుకున్న రోజులు. నిజాం పాలనపై తిరుగుబాటు చేస్తూ సాయుధులై పోరాటబాట పట్టిన నాయకులను విచక్షణ రహితంగా చిత్రహింసలు పెట్టిన రోజులవి. అలుపెరగని పోరాటం, నిరంకుశత్వ పాలనపై విరుచుకుపడిన వీరత్వం, నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మడమ తిప్పని యోధుల పోరాట పటిమ నేటికీ స్ఫూర్తి దాయకమే. అలాంటి సాయుధ సమరంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న సర్వారం, జామ్లతండా గ్రామాల నాయకులు చూపిన తెగువ.. చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివి. ఒకవైపు రక్షణ కోసం.. మరోవైపు వెట్టిచాకిరి నుంచి పేద ప్రజల విముక్తి కోసం అడుగులు వేసిన నాయకుల రాతలను చెరిపివేసే గీతలవి. నిజాం పాలనలో రజాకార్లు మారుమూల గిరిజన గ్రామాలపై విరుచుకుపడి రాక్షసత్వాన్ని ప్రదర్శించి రాజసత్వంగా నిలిచిన క్రమంలో పెల్లుబుకిన ఆక్రందనలతో మేము సైతం ముందున్నా మంటూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రజాకార్లను ఊరి పొలిమేర నుంచి పారదోలిన రోజుల్లో రారాజులుగా నిలిచిన త్యాగధనులు వీరు. సర్వారం పంచాయతీ పరిధిలోని కోయగూడెంలో సాయుధ పోరాట యోధుడుగా పేరుగాంచి బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా రజాకార్ల ఆగడాలను అరికట్టేందుకు ఆ ఊరికే జవాన్‌గా నిలిచి పేరు తెచ్చుకున్న సాయుధ పోరాట యోధుడు కంగల బుచ్చయ్యను నేడు (బుధవారం) తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా స్మరించుకుంటున్నాం.

కంగల బుచ్చయ్య సేవలు చిరస్మరణీయం

కమ్యూనిస్టు ఉద్యమానికి పేరుగాంచి శేషగిరి అనుచరులుగా అశ్వాపురం వద్ద గోదావరి సమీపాన దాక్కొని వర్సా పాపయ్య నేతృత్వంలో గుల్‌బర్గా జైలుకు వెళ్లి ఎన్నో ఎదురుదెబ్బలు తిన్న కంగల బుచ్చయ్య పోరాట పటిమ మరువలేనిది. కమ్యూనిస్టు మార్క్సిస్టు (సీపీఎం) నేతృత్వంలో ఊరి కోసం ఎన్నో ఉద్యమాలను ఉసిగొలిపి సహ ధర్మచారిణిని కూడా లెక్క చేయకుండా అడవుల్లో తిరుగుతూ అణగారిన శ్రమజీవుల ఆశయ సాధన కోసం ఉద్యమించిన నేత అతను. అలాంటి సాయుధ పోరాట యోధుడు కంగల బుచ్చయ్య చరిత్రను పరిశీలిస్తే... 1962లో బూర్గంపాడు నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా స్థానం దక్కించుకున్నారు. ఆనాటి నుంచి అంతర్గతంగా అడవి నుంచి అధికారుల వరకు పాలన చేజిక్కించుకుని తనదైన శైలిలో ఎన్నో ఉద్యమాలను చేయసాగారు. రాజీలేని పోరాటాలుచేస్తూ గ్రామస్థాయిలో పేద జీవిత విధానాన్ని సరిదిద్దుతూ... సంపాదనలేని స్వయం పాలనను కొనసాగిస్తూ ఆదర్శప్రాయంగా నిలిచాడు. అలాంటి సాయుధ నేతకు భార్య కంగల బుచ్చమ్మ చేయూతనివ్వడమే కాకుండా కుమార్తెలు భారతి, ఉమా మహేశ్వరి, కొడుకు అరుణ్ కుమార్‌లను జన్మనించి వారిని కూడా ఉద్యమ బాటలో నడిపించడం వారి విప్లవాత్మకమైన నిర్ణయానికి నిదర్శనం. ఏలూరి లక్ష్మీనారాయణ, పర్సా సత్యనారాయణ, మంచికంటి రాంకిషన్ రావు సరసన నిలిచిన కంగల బుచ్చయ్య సాయుధ పోరాట నేతగా అందరికీ చిరస్మరణీయంగా నిలిచారు.



బేతంపూడి గ్రామంలో 1947లో బ్రిటీషు వారు నిర్మించిన బావి

ఆది నుంచి తుది వరకు సర్వారం, జామ్లతండాలు..

సాయుధ పోరాటంలో ఎదురుదెబ్బలు తగిలి అటు రజాకార్లు, ఇటు పోలీసోళ్ల ఒత్తిడికి లోనవుతున్న తరుణంలో భర్త కంగల బుచ్చయ్య మనో ధైర్యానికి తోడుగా నిలిచి ఆది నుంచి తుదిశ్వాస వరకు అడుగులో అడుగేసి నిల్చున్నారు సర్వారం, జామ్లతండా గ్రామాలు.అప్పటి ఆనందం, ఎదుర్కొన్న ఇబ్బందులు ప్రస్తుత తరుణంలో, మారుతున్న రాజకీయాలపై మరో సాయుధ ఉద్యమం జరిగితే బాగుంటుందని తెలుస్తుంది. చిన్నతనంలో చీకటోళ్ల వస్తున్నారని భయపడేవాళ్లం, పొద్దు పొడిచిన కాడి నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు ఆడుతూ పాడుతూ తిరిగే సమయంలో అవ్వ నాయనలు మమ్మల్ని అక్కున చేర్చుకుని చీకటోళ్ల వస్తున్నారని, బయటికి వెళ్లొద్దని, ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతికే రోజులవి. భూ పెత్తందారుల వ్యవస్థ పెట్రేగిపోతున్న తరుణంలో రజాకార్లు పోలీసుల మధ్య నలిగిన బతుకుల్లో సాయుధ పోరాట యోధులుగా పేరుగాంచిన నేతలు ఊళ్లకు వచ్చి మీటింగ్‌లు పెడితే వారి వెంటే పరిగెట్టేవాళ్లం. ఆనాడు పడ్డ కష్టాలు నేడు స్వేచ్ఛ స్వాతంత్ర్య ఫలాలు తమ బిడ్డలకు అందిస్తున్నామని ఆ రెండు గ్రామాల ప్రజలు వెల్లడించారు.

తెలంగాణ సాయుధ పోరాటాల పురిటిగడ్డ బోనకల్

- గోవిందాపురం(ఎల్)లో ఒకే చితిపై ఏడుగురి దహనం
- భూమి, భుక్తి కోసం రజాకార్లను వణికించిన పోరాట యోధులు



ఒకే చితిపై ఏడుగురిని దహనం చేసిన ప్రాంతంలో స్థూపం

బోనకల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటాల పురిటిగడ్డగా బోనకల్ మండలానికి ప్రత్యేక చరిత్ర ఉంది. భూమి, భుక్తి, విముక్తి కొరకు సాగిన పోరులో ఎందరో పోరాట యోధులు నేలకొరిగారు. ప్రత్యేకమైన క్యాంపులు ఏర్పాటు చేసి, గెరిల్లా శిక్షణతో సైన్యంను తయారు చేసి రజాకార్ల వెన్నులో వణుకు పుట్టించిన అమరవీరుల చరిత్ర నేటికీ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచి పోయింది. నాటి నెత్తుటి ధారలకు నిలువెత్తు సాక్ష్యాలుగా గ్రామాల్లోని అమరవీరుల స్థూపాలు దర్శనమిస్తున్నాయి. నేడు తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

ఒకే చితిపై ఏడుగురు..

దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చినా, హైదరాబాద్ రాష్ట్రానికి మాత్రం స్వాతంత్ర్యం రాలేదు. రజాకార్ల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కుటుంబాలను వదిలి, తుపాకులను చేతబూని రజాకార్లపై పోరాటం సాగించిన పోరాట యోధులు నేల కొరిగారు. అలాంటి సంఘటన గోవిందాపురం(ఎల్) గ్రామంలో ప్రధానంగా చెప్పవచ్చు. రజాకార్లపై తిరుగుబాటు చేస్తున్న ఆళ్లపాడు గ్రామానికి చెందిన యలమందల రాంచంద్రయ్య, మంద అచ్చయ్య, వల్లాపురంనికి చెందిన గొర్రెముచ్చు అజరయ్య, మద్ది రాములు, రేపల్లెవాడకు చెందిన మడుపల్లి వీరస్వామి, సామినేని గోపయ్య, తమ్మినేని బుచ్చయ్య, గోవిందాపురం(ఎల్)కు చెందిన కొత్తపల్లి కృష్ణమూర్తి, గోవిందాపురం(ఎ)కు చెందిన భాగం శరయ్యతో పాటు మరి కొందరిని పట్టుకొని దళసభ్యుల సమాచారం చెప్పాలని చిత్రహింసలకు గురి చేశారు. వారిని రేపల్లెవాడ నుంచి పట్టుకొని ఈడ్చుకుంటూ గోవిందాపురం(ఎల్) గ్రామానికి తీసుకొచ్చారు. రజాకార్ల తుపాకులకు బలైన ఏడుగురిని గుర్రాలకు కట్టి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఈడ్చుకుంటూ వెళ్లి మంగల గుట్టపై ఆగారు. అక్కడ ఒకే చితిపై ఏడుగురిని పేర్చి దహనం చేశారు. కొరియర్‌గా వ్యవహరించిన కొత్తపల్లి కృష్ణమూర్తితో పాటు భాగం శరయ్యను చంపకుండా వదిలేశారు.

నెత్తుటి ధారలకు నిలువెత్తు సాక్ష్యాలు ఆ స్థూపాలు



అమరజీవి రావెళ్ల జానకిరామయ్య స్థూపం

నాడు వరంగల్ జిల్లాలో అంతర్భాగంగా ఉన్న ఖమ్మం జిల్లా బోనకల్ మండలం చిరునోముల గ్రామానికి చెందిన ప్రముఖ సాయుధ పోరాట యోధుడు రావెళ్ల జానకిరామయ్య ఆంధ్ర మహాసభ జిల్లా అధ్యక్షుడిగా, కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా పని చేశారు. ఆయన నాయకత్వంలో గోవిందాపురం (ఎల్), బ్రాహ్మణపల్లి, చిరునోముల, ముష్టికుంట్ల, ఆళ్లపాడు, చొప్పకట్లపాలెం, పెద్దబీరవల్లి తదితర గ్రామాలకు చెందిన యువకులను గెరిల్లా సైనికుల్లా తీర్చిదిద్దారు. లక్ష్మీపురంకు చెందిన మల్లెల వెంకటేశ్వరరావు, గోవిందాపురం(ఎల్)కు చెందిన చుండూరి నర్సింహారావు ప్రజా నాయకులుగా నియమించబడ్డారు. బ్రాహ్మణపల్లిలో గాదే మాధవరెడ్డి హత్య తరువాత ఉద్యమానికి కేంద్రంగా ఆ గ్రామం మారింది. పైడిపల్లి జోగయ్య, పారుపల్లి జోగయ్యలు పోరాటంలో కీలక పాత్రం పోషించడంతో వందలాది ఎకరాల భూములను పేదలకు పంచారు. మండలంలోని గోవిందాపురం(ఎల్), లక్ష్మీపురం గ్రామాలకు చెందిన రావూరి వెంకట రామయ్య, మల్లెల విశ్వనాథం, తమ్మారపు భద్రయ్య, చుండూరి కృష్ణమూర్తి, కారంగుల సైదులు, తమ్మారపు హుస్సేన్‌లు, ముష్టికుంట్ల, చిరునోముల గ్రామాల నుంచి చెల్లి వీరస్వామి, బోడేపుడి శేషయ్య, కటారి రామకోటయ్య, నిమ్మతోట జగ్గయ్య, సీతయ్యలతో పాటు గంగసాని తిరుమలయ్య, పారుపల్లి రాఘవయ్య, పెద్ద కోటయ్య, గాదే శ్రీనివాస్‌రెడ్డి, వంగల పెద్ద వెంకటేశ్వర్లుతో పాటు పలువురు పోరాట యోధులు మడమ తిప్పని పోరాటాలు చేశారు.

పామాయిల్ గెలలకు రూ.25వేలు కనీస ధర ఇవ్వాలి

అఖిలభారత కిసాన్ సభ అధ్యక్షుడికి పామాయిల్ రైతుల వినతి



అఖిలభారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులకు ఆయిల్‌పామ్ రైతు సంఘం నాయకుల వినతి

అశ్వారావుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ గెలలు ధర టన్నుకు రూ.25వేలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అఖిల భారత కిసాన్ జాతీయ అధ్యక్షుడు అశోక్ రావాలేకు తెలంగాణ ఆయిల్‌ఫామ్ రైతు సంఘ అధ్యక్ష కార్యదర్శులు తుంబూరు మహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య వినతిచేశారు. మంగళవారం ఢిల్లీలో సీపీఎం అనుబంధ అఖిల భారత కిసాన్ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు తెలంగాణ ఆయిల్‌ఫామ్ రైతు సంఘం నుంచి అధ్యక్ష కార్యదర్శులతో పాటు సాగర్, శోభన్, బొంతు రాంబాబు తదితరులు పాల్గొని తెలంగాణ ఆయిల్‌ఫామ్ రైతుల సమస్యలపై చర్చించారు. అనంతరం ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు అశోక్ రావేకు ఆయిల్‌ఫామ్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ధర నిర్ణయంలో రైతు సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, అప్‌టెక్ బాధిత రైతులకు నష్టపరిహారంగా విత్తన కంపెనీ నుంచి వసూలు చేయాలని, ఐఐఓపీఆర్ పరిశోధన బ్రాంచ్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డి, శ్రీనివాసులు, సోమయ్య, వెంకట్, చందునాయక్ పాల్గొన్నారు.

పోలీసు భద్రత మధ్య యూరియా పంపిణీ

బూర్గంపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బూర్గంపాడులోని సొసైటీ కార్యాలయంలో మంగళవారం పోలీసుల బందోబస్తు మధ్య రైతులకు యూరి యా బస్తాలను అందజేశారు. యూ రియా బస్తాలు ఇస్తున్నారనే సమాచారం తెలుసుకున్న రైతులు సొసైటీ కార్యాలయంకు భారీగా చేరుకున్నారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతవరణం నెలకొంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని రద్దీని అదుపుచేస్తూ ప్రశాంత వాతవరణంలో యూరియా బస్తాలను సరాఫరా చేసే విధంగా చర్యలు చేపట్టారు.

తెలుగుతో వెలుగు నింపగా..

పలు అంశాల్లో గిరి బిడ్డలకు పోటీలు.. ప్రోత్సాహకాలు

తెలుగుదనంపై మరోసారి ప్రేమను చాటిన పీవో రాహుల్



ప్రముఖుల వేషధారణలో ఉన్న చిన్నారులతో పీవో రాహుల్

భద్రాచలం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాతృభాష మాధుర్యం వర్ణించలేనిది, తెలుగుతో వెలుగు నింపేందుకు ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు, సత్తాచాటిన వారికి ప్రోత్సాహకాలను భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అందజేశారు. మంగళవారం భద్రాచలంలోని గిరిజన భవనంలో జరిగిన కార్యక్రమంను పీవో రాహుల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలి నుంచి తెలుగుభాషపై ఎంతో మక్కువ చూపుతున్న రాహుల్ తెలుగు భాషా దినోత్సవంను పురస్కరించుకొని గిరి బిడ్డలకు కవితలు, శీర్షికలు, పద్యాలు, ఒక నిమిషం పాటు తెలుగులో మాట్లాడం, ఏకపాత్రాభినయం, క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి తనవంతుగా ప్రోత్సాహకాన్ని అందించారు. ఐటీడీఏ చరిత్రలోనే తొలిసారి తెలుగు భాషా కోసం పీవో చేపట్టిన కార్యక్రమంకు సర్వత్రా హర్షాతిరేకం వ్యక్తం అవుతుంది. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన విద్యా సంస్థల్లో చదువుతున్న చిన్నారులు పాల్గొని అందరినీ అబ్బురపరిచారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పీవో రాహుల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలుగుభాషపై పట్టు, సృజనాత్మకత పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈపోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు రూ.500 నుంచి రూ.3000వేల వరకు వివిధ అంశాల్లో రాణించిన వారికి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు మణేమ్మ, విజయలక్ష్మీ, గురుకులం ఆర్‌సీవో అరుణకుమారి, ఏసీఎంవోలు రమేష్, రాములు పాల్గొన్నారు.

చుంచుపల్లిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి సీజ్



చుంచుపల్లి విద్యానగర్‌కాలనీలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్ మధువరన్

చుంచుపల్లి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): చుంచుపల్లి మండలంలోని విద్యానగర్‌కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిని మంగళవారం భద్రాద్రి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ మధువరన్ సీజ్ చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం-2010 నిబంధనలను పాటించలేదనే ఆరోపణల నేపథ్యంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి ఆదేశాలను సారం తనిఖీలు చేపట్టి పరిశీలించారు. నిర్దేశించిన ప్రమాణాలను నిర్వహించడంలో అద్విత ఆస్పత్రి విఫలమైందని, కనీస వసతులు, సౌకర్యాలు, సిబ్బంది లేరని గుర్తించారు. ప్రైవేట్ ఆస్పత్రులు తప్పక రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే ప్రజారోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని అట్టి ఆస్పత్రులను గుర్తించి సీజ్ చేస్తామని హెచ్చరించారు. వీరి వెంట డిప్యూటీ డెమో మహ్మద్‌ఫైజ్ మోహినుద్దీన్ తదితరులు ఉన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

నేలకొండపల్లి,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం మధ్యాహ్నం మండలంలో పర్యటించనున్నారు. బుధవారం సాయంత్రం 4.15లకు ముటాపురం గ్రామంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేయనున్నారు. 4.45కు రాజేశ్వరపురం, 5.15కు కొత్తకొత్తూరు గ్రామాల్లో సీసీరోడ్లకు శంకుస్థాపన, కొత్తకొత్తూరులో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తారు. 5.45కు భైరవునిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. 6.15లకు నేలకొండపల్లిలో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రికార్యక్రమాన్ని విజయవంతం చేయాలని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి ప్రకటనలో కోరారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్

నిర్దిష్ట సమయంలో అనుమతులు ఇవ్వాలి

- కలెక్టర్ అనుదీప్
- టీజీ ఐ-పాస్ కమిటీతో సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూనిట్ల ఏర్పాటుకు అనుమతికోసం వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖలు నిర్దిష్ట సమయంలోగా పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి టీజీ ఐ-పాస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో 4 జూన్, 2025 లో నిర్వహించిన సమావేశంలో చర్చించిన 25 యూనిట్లకు సంబంధించి వివిధ రకాల 57 అనుమతుల విషయమై అభ్యంతరాలను శాఖల వారిగా కలెక్టర్ సమీక్షించారు. ఈ యూనిట్లలో గ్రానైట్, రైస్ మిల్లులు, క్రూడ్ పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు తదితరాలున్నాయన్నారు. జిల్లాలో పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు వనరులు ఉన్నాయన్నారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు సహకారం అందించాలన్నారు. అనుమతులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇవ్వాలన్నారు.ఈ సమావేశంలో ఇండస్ట్రీస్ జీఎం సీతారాం, మైన్స్ ఏడీ సాయినాథ్, ఆర్డీవో వెంకటరమణ, జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్, వివిధ శాఖల అధికారులు, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.యుగంధర్, ప్రధాన కార్యదర్శి కె.గోపాల్‌రావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల శిక్షణ

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం అర్బన్ ప్రాజెక్టులోని పలు సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం 'పోషణభి పడాయిభి' కార్యక్రమంపై శిక్షణ ప్రారంభించారు. మూడు రోజుల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా తొలిరోజు అర్బన్ సీడీపీవో వీరభద్రమ్మ ప్రారంభించారు. ఈ నెల16 నుంచి 18 వరకు ఈ కార్యక్రమాలపై శిక్షణ ఉంటుందని సీడీపీవో తెలిపారు.ఈ కార్యక్రమాలకు మూడు బృందాలుగా అంగన్‌వాడీ టీచర్లను నియమించటం జరుగుతుందని తెలిపారు. ఒక్కో బృందంలో 100అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ అందిస్తామని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా సూపర్‌వైజర్లు, నోడల్ అధికారిగా సీడీపీవో వ్యవహరించనున్నారని అన్నారు.



శిక్షణను ప్రారంభిస్తున్న సీడీపీవో వీరభద్రమ్మ

ఆ వీధి వ్యాపారుల ప్రాంగణంలో

సమూల మార్పులు

- ధరలపట్టిక, అద్దెలు నిర్ణయించేందుకు కార్యాచరణ
- ఆదేశాలు జారీ చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్య
- విచారణ చేపట్టిన డిప్యూటీ కమిషనర్, టీఎంసీ

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి) 16: పాతబస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణంలో సమూల మార్పులు చేయనున్నారు. అధిక ధరలకు ఇక కళ్లెం పడనుంది. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ, నిఘా నడుమ ఇక మీదట వినియోగదారులు కొనుగోలు చేసేందుకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య చర్యలు చేపట్టారు. రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న అధికధరల దందాకు అడ్డుకట్ట పడనున్నది.





ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం, విచారణ చేస్తున్న డిప్యూటీ కమిషనర్

రూ.1.25 కోట్లతో ఆధునీకరణ

ఖమ్మం నగరంలోని పాతబస్టాండ్ ఎదురుగా వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని ప్రభుత్వం రెండు దశాబ్దాల క్రితమే ఏర్పాటు చేసింది. జిల్లా నలుమూలల నుంచి ఖమ్మానికి బస్సుల్లో వచ్చిన కిరాణం, చిరు వ్యాపారులు బస్టాండ్‌కు సమీపంలోనే ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణంలో కొనుగోలు చేస్తారని ఏర్పాటు చేశారు. వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించిన తర్వాత దీన్ని ఆధునికీకరించారు. రూ.1.25కోటి నిధులతో షెడ్‌లను నిర్మాణం చేశారు. 180మంది వ్యాపారులు కూరగాయలు అమ్మకాలు చేసేందుకు కావాల్సిన నిర్మాణాలను పూర్తి చేశారు.

అయితే ఎప్పటి నుంచి ఉంటున్న వ్యాపారులు కనీసం ధరల బోర్డును ఏర్పాటు చేయకపోగా ధరలపై ప్రశ్నించిన ప్రజలపై దాడులు చేసే వరకు వెళ్లారు. ఈక్రమంలో ఖమ్మం రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదులు చేయగా కేసులు నమోదు జరిగాయి. చర్యలు మాత్రం శూన్యం.

క్షేత్రస్థాయిలో విచారణ

ఈనెల 14న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ధరలు అడిగితే దంచుడే' కథనంపై ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. వీధి వ్యాపారుల ప్రాంగణంలో క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నివేదికలు ఇవ్వాలని కేఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణిని ఆదేశించారు. దీంతో వారు మంగళవారం వీధి వ్యాపారుల ప్రాంగణంలో విచారణ చేపట్టారు. కూరగాయల ధరలు బోర్డులు లేని విషయాన్ని గుర్తించారు. గతంలో జరిగిన వివాదాలపై ఆరా తీశారు. నివేదికను కమిషనర్‌కు అందించారు. త్వరలో ఈ ప్రాంగణంలో పారదర్శకంగా ప్రజలకు అందుబాటులో ధరల్లో కూరగాయలు అమ్మకాలు జరగనున్నాయి. దుకాణాలు కేటాయించబడిన వారే నేరుగా వచ్చి అమ్మకాలు జరిపేలా, ధరల బోర్డులతో అమ్మకాలు జరిపేందుకు, ప్రతీ దుకాణానికి నిర్ణీత అద్దెలు విధించేందుకు ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన షర్ఫుద్దీన్



నేలకొండపల్లి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును నేలకొండపల్లికి చెందిన బీజేపి రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకుడు షేక్.షర్ఫుద్దీన్ మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను రామచందర్‌రావుకు వివరించారు.

నేడు నెట్‌బాల్ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కొత్త కలెక్టరేట్ వద్ద గల సెడార్‌వ్యాలీ పాఠశాలలో జూనియర్ బాలురు, బాలికల విభాగంలో నెట్‌బాల్ జిల్లా జట్లఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఫణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.

19న నిరసన: యూటీఎఫ్

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం మసబ్ ట్యాంక్ లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.రంజాన్, పారుపల్లి.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. నగరంలోని సంఘం భవనంలో జరిగిన సమావేశంలో ఈవివరాలు వెల్లడించారు.

నేడు వీధి వ్యాపారులకు ప్రత్యేక శిక్షణ

ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వీధివ్యాపారులు, మహిళా శక్తి క్యాంటీన్లు ద్వారా ఆహారపు రుచులు అందబోతున్నాయి. దేశవ్యాప్తంగా ఆహారపు నాణ్యతా ప్రమాణాలను పెంచేందుకు ప్రధాన మంత్రి స్వనిధి ద్వారా ఆహార నాణ్యతా శిక్షణలు ఇస్తున్నారు. ఈ క్రమంలోనే లోక కల్యాణమిల్స్ పేరుతో బుధవారం నుంచి అక్టోబరు 2వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన మున్సిపాలిటీల్లో మెప్మా ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈక్రమంలోనే ఈనెల18న ఖమ్మంలో 100 మంది వీధి వ్యాపారులకు హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణులు మహిళా శక్తి క్యాంటీన్‌ల నిర్వాహకులకు శిక్షణ ఇవ్వనున్నారు.

వెటరన్ బ్యాడ్మింటన్‌లో నర్సయ్య ప్రతిభ

ఖమ్మంస్పోర్ట్స్,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఈనెల7 నుంచి 14 వరకు థాయిలాండ్ దేశంలో జరిగిన అంతర్జాతీయస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్‌లో జిల్లాకు చెందిన రిటైర్డ్ డీఎస్పీ కె. నర్సయ్య సత్తా చాటి కన్సోలేషన్ బహుమతి సాధించాడు. 75ప్లస్ ఏజ్‌గ్రూప్ డబుల్స్ విభాగంలో ఇండియా టీమ్ తరుపున పాల్గొన్నారు. ఇంగ్లాండ్, మలేషియా, డెన్మార్క్, స్వీడన్ దేశాల క్రీడాకారులతో పోటీ పడ్డారు. పాల్గొన్న పోటీలలో తన అత్యుత్తమ పోరాట పటిమతో నిర్వాహకులను, ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ బాధ్యులను ఆకట్టుకున్నాడు.



బాధ్యతలు స్వీకరించిన జీపీవోలు

ఖమ్మంకలెక్టరేట్,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి):ఖమ్మంఅర్బన్ మండలంలోని 14 రెవెన్యూ గ్రామాలకు ప్రభుత్వం గ్రామ పాలన అధికారులను నియమించింది. మంగళవారం వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు తహసీల్దారు సైదులు వారిని స్వాగతించారు. గ్రామ పాలన అధికారులు(జీపీవో)లు అంకితభావంతో విధులు నిర్వహించాలని కోరారు. వీరికి తహసీల్దార్ బాధ్యతలు తెలిపారు.

క్లస్టర్‌పేరు	జీపీవో పేరు	సెల్‌నెంబర్
ఖమ్మం 1	షేక్ హైమద్	9908801718
ఖమ్మం-2	నెల్లూరి లవణ్‌కుమార్	9701888001
ఖమ్మం-3	షేక్ జమాల్	9553336254
బుర్హాన్‌పురం1	బి వీరన్న	9603317478
బుర్హాన్‌పురం2	పి శ్రీను	9848256338
పాకబండ 1	టి శైలజ	9110741873
పాకబండ 2	జె శ్రీనివాసరావు	8019657683
బల్లెపల్లి	వి ఉపేందర్	8179719873
ఖానాపురం	1కె వెంకటేశ్వరరావు	9885857777
ఖానాపురం 2	బి రాంబాబు	9490772951
వెలుగుమట్ల	ఎం హుస్సేన్	9494597512
ధంసలాపురం	కెబీఎం కృష్ణ	9618896520
మల్లెమడుగు	బ్రహ్మం	8187836326
దానవాయిగూడెం	ఏ శ్రీలక్ష్మి	9652410090

తెలంగాణ సాయుధ పోరాటంపై

బీజేపీ దుష్ప్రచారాన్ని సహించం

- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా

నేలకొండపల్లి,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటంపై బీజేపి దుష్ప్రచారం చేస్తున్నదని, దాన్నిఎట్టి పరిస్థితుల్లో సహించబోమని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నేలకొండపల్లిలోని రావెళ్ళభవన్‌లో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. సాయుధ రైతాంగ పోరాటంలో నాలుగు వేలమంది తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని, పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన గొప్ప చరిత్ర సాయుధ పోరాటానిదన్నారు. వీర తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న తరం మొత్తం మారిపోయిందని, నేటి తరానికి తాము ఏమి చెప్పినా చెల్లుతుందనే అహంకారంతో బీజేపీ తెలంగాణా సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నదన్నారు. వారోత్సవాల ముగింపు సభ బుధవారం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో జరుగుతుందని, దాన్నివిజయవంతం చేయాలని నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సమావేశంలోడివిజన్ కార్యదర్శి బండి రమేష్, పగిడికత్తుల నాగేశ్వరరావు గుడవర్తి నాగేశ్వరరావు, షేక్.బషీరుద్దీన్, మండల కార్యదర్శి కేవిరామిరెడ్డి, రచ్చా నర్సింహారావు, ఏటుకూరి రామారావు, మారుతి కొండలరావు, సామాల మల్లికార్జున్, రాసాల కనకయ్య, దండా సూర్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

అడ్డుకుంటే.. ఆగుతుందా?

(5వ పేజీ తరువాయి)

వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. ఈ క్రమంలో మార్చి నుంచి ఇసుక అక్రమ రవాణాపై పలు మార్లు కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే.

అడ్డుపడినా అక్రమ రవాణా ఆగుతుందా

ఏపీలోని చింతలపూడిలో పెద్ద సంఖ్యలో ఇసుక వాహనాలు పట్టుబడటం సంచలనమే అయినా దీనిని ఇసుకాసురులు అంత సీరియస్‌గా తీసుకోవటం లేదనే ప్రచారం జరుగుతోంది. కొంత మేర ఇసుక అక్రమ రవాణాకు తాత్కాలికంగా బ్రేక్ పడిందని అంటున్నా.. ఇప్పటి వరకూ భారీ లాభాలకు అలవాటు పడిన అక్రమార్కులు తమకు సత్తుపల్లి నియోజకవర్గంలో సహకరిస్తూ వస్తున్న అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో తిరిగి కొనసాగించాలనే నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఓ నాయకుడు ఇసుక అక్రమార్కులకు కొమ్ముకాస్తూ అధికారుల వద్ద తన పలుకుబడి ఉపయోగించి పట్టుబడిన లారీలను విడిపించటం, కొన్ని వాహనాలకు రక్షణ కల్పించడం లాంటివి చేస్తున్నాడని సమాచారం. ఆ నాయకుడు చివరకు తానే బినామీ పేర్లతో లారీలు కొని ఇసుక వ్యాపారంలోకి దిగినట్టు ప్రచారం జరుగుతోంది.

అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

తెలంగాణలోని పలు జిల్లాలకు నిత్యం ఏపీ నుంచి సత్తుపల్లి నియోజకవర్గం మీదుగా వాహనాలు తరలిపోతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరించటం తీవ్రవిమర్శలకు తావిస్తోంది. సత్తుపల్లి మండలంలోకి వాహనం ప్రవేశించి-తల్లాడ మండలం దాటే వరకూ సుమారు 75కిలోమీటర్లు ఉండగా..ఆ వాహనాలు దర్జాగా రాకపోకలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీని వెనుక.. ఆర్థిక లావాదేవీలు, రాజకీయ ప్రమేయం పెద్దఎత్తున ఉండటమే కారణమని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో అధికారులు మాత్రం తమకు ఫిర్యాదు అందటం లేదని, సమాచారమిస్తే కఠినంగా వ్యవహరిస్తామంటూ మాటలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

మొక్కుబడిగా దాడులు

ఇటీవల కాలంలో అక్రమ ఇసుక లారీలు పట్టుకుంటున్నా కేవలం మొక్కుబడిగా జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక అక్రమ వ్యాపారుల్లో పోటీ పెరిగి వారిలో వారు ఫిర్యాదు చేసుకున్నప్పుడు మాత్రమే లారీలు పట్టుపడుతున్నాయని చెబుతున్నారు. దీనికి తోడు పట్టుకున్న లారీలకు సంబంధించి జరిమానాల విషయంలో కూడా చూసీచూడనట్టు వ్యవహరించటం, పట్టుకున్న ఇసుకను కొద్ది మొత్తంలో డంప్ చేయించి కొంత లారీల్లోనే వదిలేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

సెటిల్‌మెంట్లతో చెక్...

ఇసుక అక్రమ వ్యాపారానికి అడ్డు రాకుండా కొందరు .. 'తిలాపాపం తలా పిడికెడు' అన్న చందంగా ఆర్థిక ప్రలోభాలకు లొంగిపోగా.. కొన్ని కీలక వ్యవస్థలో ఉన్న వారు కూడా తమ సంపాదనే ధ్యేయంగా తమ విశ్వరూపం ప్రదర్శిస్తున్నారు. ఇసుక లారీలు వస్తున్నాయనే సమాచారంతో సరిహద్దుల్లోకి వెళ్లి మరీ డిమాండ్ చేసి మరీ డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఎవరి స్థాయిని బట్టి వారు అక్రమ ఇసుక నుంచి కరెన్సీ పిండుకుంటున్నారు. అక్రమ వ్యాపారులు కూడా ఇదే అదనుగా భావించి వారందరినీ సెటిల్‌మెంట్లతో లొంగదీసుకుంటున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.



ఇసుక దందాపై ఇంతకు ముందే ఆంధ్రజ్యోతి ప్రచురించిన కొన్ని కథనాలు

బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా

వాసుదేవరావు బాధ్యతల స్వీకరణ

ఖమ్మంబైపాస్‌రోడ్,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా ఇటీవల నియమితులైన దేవకి వాసుదేవరావు మంగళవారం హైదరాబాదులో బాధ్యతలు స్వీకరించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రఅధ్యక్షుడు నారపనేని రామచంద్రరావు సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. వాసుదేవరావు ప్రమాణ స్వీకారానికి ఖమ్మంనుంచి భారీసంఖ్యలో పార్టీనాయకులు, కార్యకర్తలు హాజర య్యారు. ఈకార్యక్రమంలో బీజేపీ ఖమ్మంజిల్ల అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరారవు, నాయకులు మందడపు సుబ్బారావు, పుల్లారావుయాదవ్, రవికుమార్, నంబూరి రామలింగేశ్వరరావు, సుదర్శన్ మిశ్ర, ఏలూరి నాగేశ్వరరావు, విజయరాజు, వీరవల్లి రాజేష్, ఏల్చుల సుధాకర్, పాల్గొన్నారు.



ర్యాలీగా వెళుతున్న వాసుదేవరావు

పది, ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్

ఖమ్మంక్రైం, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 22నుంచి 29వరకు ఖమ్మంకమిషనరేట్ పరిధిలో పరీక్ష కేంద్రాల్లో నిర్వహించే పది, ఇంటర్(టీవోఎస్ఎస్) పరీక్షల సందర్భంగా కేంద్రాల వద్ద సెక్షన్ 163బీఎన్ఎస్ యాక్ట అమల్లో ఉంటుందని సీపీ సునీల్‌దత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలనుంచి సాయంత్రం 6:30 గంటల వరకు అమల్లో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాలకు 200మీటర్ల దూరం వరకు ఐదుగురుకు మించి గుంపులుగా ఉండవద్దని తెలిపారు. ఎలాంటిసభలు, సమావేశాలు ర్యాలీలు,డీజేలతో ఊరేగింపులు,ధర్నాలు ప్రచారాలు నిర్వహించవద్దని చెప్పారు. పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రాల పరిసరాలలో ఇంటర్‌నెట్ కేంద్రాలు, జిరాక్సుషాపులు మూసివేయాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన ప్రొఫెసర్లు

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలను మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయం, తెలంగాణ విశ్వవిద్యాలయ కామర్స్‌విభాగ ప్రొఫెసర్ల బృందం కళాశాల కామర్స్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్‌లను సందర్శించారని ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకిరుల్లా తెలిపారు. కామర్స్ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగంలో పరిశోధనా కేంద్రంగా గుర్తించేందుకు మౌలిక సదుపాయాలు, రీసెర్చ్ సూపర్ వైజర్స్‌గా అర్హత కలిగిన అధ్యాపకులు, ఆసక్తి కలిగి దరఖాస్తు చేసుకున్న వారి బోధనానుభవం, పరిశోధనా అనుభవం తదితర అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ బృందంలో చైర్మన్‌గా ప్రొఫెసర్ కట్ల రాజేందర్ కేయూడీన్ ఫ్యాకల్టీ, కామర్స్, మేనేజ్మెంట్‌విభాగం ఆధ్వర్యంలో మరికొందరు సభ్యులు పరిశీలన జరిపారు. ఈ నివేదికను విశ్వవిద్యాలయానికి అందజేస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రతీ ఒక్కరికి అండగా ఉంటాం

ఖమ్మంరూరల్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ప్రతీఒక్కరికి పీఎస్ఆర్ ట్రస్ట్ అండగా ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జీ తుంబూరి దయాకర్ రెడ్డి అన్నారు.వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలకు మంగళవారం ఒక్కోకుటుంబానికి రూ.10వేల చొప్పున అందజేశారు.

ఖమ్మం కీర్తి పెరిగేలా పని చేయాలి

కేఎంసీ కమిషనర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నూతన కమిటీ

ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థకు, పట్టణ ప్రజలకు కీర్తి పెరిగేలా బాధ్యతలు నిర్వహించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. నూతనంగా ఎన్నికైన కేఎంసీ టీఎన్జీవోస్ కమిటీ మంగళవారం మర్యాదపూర్వకంగా కమిషనర్‌ను కలిసి పూలమొక్కను అందించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు,కొణిదెన(బుల్లెట్)శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీకాంత్, హరికృష్ణ, కేఎంసీ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు సుధాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారిశుధ్య వాహనాల తనిఖీ

ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం 36, 46, 48, 58 డివిజన్లలో పారిశుధ్య కార్మికుల పనితీరును పరిశీలించారు. హాజరు రికార్డులను తనిఖీ చేశారు. హాజరు తక్కువగా ఉన్న వారి వివరాలను నమోదు చేసుకున్నారు. 36వ డివిజన్‌లో చెత్త ఆటోలు, ట్రాక్టర్లు నిత్యం వస్తున్నాయా అని కాల్వలు శుభ్రం చేస్తున్నారా తెలుసుకున్నారు. 36, 46, 48, 55 డివిజన్లలో డివైడర్లు నిర్వాహణ తనిఖీలు చేశారు. ఉద్యాన అధికారితో మాట్లాడి డివైడర్లు ఆధునికీకరణకు ప్రతిపాదనలు చేయాలని సూచించారు. జటాయు, స్వీపింగ్ యంత్రాల పనితీరును పరిశీలించారు. ప్రతీరోజు ప్రధాన రహదారులను స్వీపింగ్ మిషన్‌తో పనులు చేయించాలని ఆదేశించారు.



కమిషనర్‌కు పూలమొక్కను అందిస్తున్న నూతన ఉద్యోగుల కమిటీ

రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

ఖమ్మంరూరల్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత ప్రతీఒక్కరి బాధ్యతని ఖమ్మం ట్రాఫిక్ ఎస్.ఐ.రవి కుమార్ అన్నారు. పెద్దతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రోడ్డుభద్రతపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ.రవికుమార్ మాట్లాడుతూ రోడ్డుమీద ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాలకు ముప్పుఅని వివరించారు. ఈకార్యక్రమంలో కళాశాల చైర్మన్ నవీన్‌బాబు, ప్రిన్సిపల్ బి.గోపాల్,అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఇంటూరి శేఖర్‌కు మాతృవియోగం





శేఖర్‌ను పరామర్శిస్తున్న తాతా మధు, కందాళ, సండ్ర తదితరులు, భద్రమ్మ(ఫైల్)

కూసుమంచి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): డీసీసీబీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు ఇంటూరి శేఖర్ తల్లి భద్రమ్మ(75) గుండెపోటుతో మృతి చెందారు. గోపాలరావుపేట గ్రామంలో పలువురు పార్టీనాయకులు ఇంటూరి భద్రమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, సత్తుపల్లి మాజీ శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య ఇంటూరి శేఖర్‌ను పరామర్శించారు. ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శేఖర్‌ను ఫోన్లో పరామర్శించారు. అదేవిధంగా మండల నాయకులు మల్లీడు వెంకన్న, బెల్లం వేణు, వేముల వీరయ్య, ఆసీఫ్‌పాష, జర్పుల బాలాజీ, పార్టీనాయకులు తదితరులు ఉన్నారు.



అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

బోనకల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం వ్యక్తిగత సోషల్ మీడియా వ్యవహారాల ఇన్‌చార్జి శివాజి కోరారు. మండలంలోని జానకీపురం గ్రామంలో మంగళవారం బూత్ కో ఆర్డీనేటర్లు, గ్రామశాఖ అధ్యక్షుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, పైడిపల్లి కిషోర్ కుమార్, బందం నాగేశ్వరరావు, మోదుగు సుధీర్‌బాబు, చేబ్రోలు రమ, ప్రమీల, బందం శ్రీనివాసరావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, వై. హేమూన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ఎమ్మెల్యేకు వినతి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో పనిచేస్తున్న హాస్టల్ వర్కర్స్‌కు జీవో 60ప్రకారం వేతనాలు చెల్లించాలంటూ ఎమ్మెల్యే మట్టా రాగమయికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. 5వ రోజు సమ్మెలో భాగంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో సీతారత్నం, లక్ష్మీదేవి, పార్వతి, సత్యావతి, లక్ష్మి, నాగమణి, ఎల్లమ్మ, పద్మజ, మల్లమ్మ, సునీత, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రదాని నరేంద్రమోదీ జన్మదినోత్సవం సందర్భంగా నేటి నుంచి అక్టోబరు 2వరకు బీజేపీ ఆధ్వర్యంలో చేపడుతున్న అనేక సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆపార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు చేపట్టి ప్రాణాంతక వ్యాధులతో బాధపడే చిన్నారులకు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయుడు రాఘవరావు, సుదర్శన్‌మిశ్రా, పడిగల మధుసూదన్‌రావు, భాస్కర్ల వీరంరాజు, నరేష్, రహ్మతుల్లా, నాగస్వామి, సాలి శివకృష్ణ, విజయ్, ప్రభాకర్‌రెడ్డి, నరసింహారావు, రామకృష్ణ, నాగులు, పాలకొల్లు శ్రీనివాస్, శివ, వసంతరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జీతాలివ్వాలంటూ ధర్నా

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐదు నెలలుగా జీతాలివ్వాలంటూ ప్రభుత్వ ఆసుపత్రివద్ద వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ 104, ఐహెచ్ఎఫ్ఎంఎస్, శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ ఉద్యోగులు మంగళవారం ధర్నా చేశారు. జీవోల ప్రకారం విధులను నిర్వహిస్తున్న తాము జీతాలు సకాలంలో ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రమేష్, మాధురి, సాంబశివరావు, కోటి, అశోక్, నారాయణరావు, స్వరూప, త్రివేణి పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లోనే నాణ్యమైన విద్య: సీడీపీవో

సత్తుపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోషకాహార కేంద్రాలుగానే కాకుండా పిల్లలకు నాణ్యమైన ప్రారంభవిద్య ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారానే అందుతుందని సత్తుపల్లి సీడీపీవో మెహరున్నిసా బేగం తెలిపారు. సత్తుపల్లి, వేంసూరు సెక్టార్ పరిధిలోని 167అంగన్‌వాడీ టీచర్లు పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంలో భాగంగా 3రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక గర్ల్స్ హైస్కూల్ ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, గంగాజలం, మహాలక్ష్మీ, సుజాత, రమాదేవి, వంసతరాణి, కమల, భవానీ, రజిని, పోషణ అభియాన్ బీసీ ప్రసాద్, ఎల్‌డీసీ వెంకటేశ్వరరావు, శిరిష పాల్గొన్నారు.

పెన్షనర్లకు అండగా నిలబడతాం

సత్తుపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సర్వీస్‌తో పాటు వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలబడతామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సత్తుపల్లి యూనిట్ అధ్యక్షుడు కేశవరెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన నూతన సంఘ తొలి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్.ప్రకాశరావు, నర్సయ్య, కృష్ణయ్య, బూరుగు దాసు, కృష్ణయ్య, యోహాను, సాంబశివరెడ్డి, వాణి, మహమూద్, చెంచిరెడ్డి, మధుసూదనరాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కారేపల్లి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి పంచాయతీలో నెలకొన్న అనేక సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంగళవారం గ్రామానికి చెందిన సీపీఎం, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు డిమాండ్ చేశారు. ప్రధానంగా పంచాయతీ పరిధిలోని హాల్యతండా, నడిమురు, ఉసిరికాయలపల్లి గ్రామాలలో ప్రధానంగా వీధిలైట్లు, సైడ్ కాలువలు, దోమల నివారణకు సంబంధించిన మందు పిచికారి చేయాలని కోరారు. కోరారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యాదర్శి నిరంజన్‌కు వినతిప్రతం అందజేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

పంటల నమోదు చేయాలి: ఏవో

ఏన్కూరు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డిజిటల్ పంట నమోదు కార్యక్రమాన్ని కచ్చితంగా చేయాలని ఏవో నరసింహారావు ఆదేశించారు. ఏన్కూరులో మంగళవారం పత్తి పొలాలను సందర్శించారు. ప్రస్తుతం పత్తి పంటలో పచ్చదోమ, తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉందని తెలిపారు. రైతులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో భాగ్యలహరి, రైతు మేడా ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

తల్లాడ, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): నిత్యం ఫోటోగ్రాఫర్లు వత్తి నైపుణ్యం పెంచుకోవాలని తల్లాడ ఎస్ఐ బి.వెంకటేష్ అన్నారు. మంగళవారం తల్లాడలో ఫొటోట్రెండ్ ఎక్స్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19న హైదరాబాదులో నర్సింగ్ వర్కింగ్ కన్వెన్షన్‌లో జరిగే ఫొటో ట్రెండ్ ఎక్స్ ను సందర్శించి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఫోటో అండ్‌వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణ, నరేష్, ఎస్కే ఆసిఫ్, కరుణాకరరెడ్డి, గోపిశెట్టి నరేష్, కిషోర్ పాల్గొన్నారు.

మధిరలో 'సాండ్' బజార్ ప్రారంభం

మధిర,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మధిరలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉపయోగపడేందుకు మంగళవారం సాండ్ బజార్‌ను టీఎండీసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పాటు సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా సాండ్ బజార్‌ను ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఏఎంసీ చైర్మన్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ పంపిణీ

పెనుబల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జోనెబోయిన ట్రస్టు ఆధ్వర్యంలో భవన్నపాలెం గ్రామానికి చెందిన సంచు వెంకటకృష్ణ అనే దివ్యాంగుడికి ట్రస్టు నిర్వాహకురాలు, దివ్యాంగురాలైన అన్నపూర్ణ ట్రైసైకిల్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ భద్రాద్రి జిల్లా డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన స్ఫూర్తితో తనవంతు సాయంగా పదిమంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, 12మందికి వీల్‌చైర్లను అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చెలికాని నీలాద్రీబాబు, చెక్కిలాల రమేష్, సూరా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏల మండల కమిటీ ఎన్నిక

కల్లూరు, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ఇందిరా క్రాంతి పదం వీవోఏల సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) ఎన్నిక మంగళవారం జరిగింది. కల్లూరు మండల వీవోఏల సంఘం అధ్యక్షురాలిగా వేము నాగమణి, ఉపాధ్యక్షురాలిగా ధోని మల్లిక, కార్యదర్శిగా కోనూరు నీలవేణి, కోశాధికారిగా వెంకట్రావమ్మ, కమిటీ నిర్వహణ అధికారిగా మాధవి, గౌరవ అధ్యక్షుడిగా వేము రాంబాబు, గౌరవ సలహాదారుడిగా దామాల దయాకర్ రావులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో వీవోఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో హిందీ దివస్

మధిర, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నిధానపురం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం హిందీ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు హిందీ విశిష్టతను తెలిపేలా లఘు నాటికలు, ఏకపాత్రాభినయాలు, నృత్యాలు, ఉపన్యాసాలు ఇచ్చారు. అనంతరం పాఠశాల హిందీ ఉపాధ్యాయరాలు సత్యవతిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణదాసు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన జీపీవోలు

మధిర, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న గ్రామ పాలనా అధికారులు బాధ్యతతో తమ విధులు నిర్వర్తించాలని మధిర తహసీల్దార్ రాంబాబు సూచించారు. గ్రామ పాలనా అధికారులుగా ఎంపికై మధిర మండలానికి కేటాయించిన అధికారులు మంగళవారం మధిర తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాంబాబును కలిశారు. గ్రామ సుపరిపాలన కోసం ప్రభుత్వం జీపీవోలను నియమించిందని ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో, బాధ్యతతో విధులు నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకరావడంతో పాటు ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ డేవిడ్, ఆర్ఐ భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మధిరలో తహసీల్దార్‌ను కలిసిన జీపీవోలు



కారేపల్లి మండలానికి వచ్చిన నూతన జీపీవోలు

తల్లాడ: మండలంలో నూతనంగా నియమితులైన జీపీవోలు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తల్లాడ జీపీవోగా బి.విజయ్‌కుమార్, మల్లారం బి.స్వప్న, కలకొడిమ ఆర్.గురవయ్య, ముద్దునూరు టి.రామానుజయ్య,మిట్టపల్లి కె.హనుమంతరావు, రేజర్లక బి.ప్రమీల, రామానుజవరానికి ఎం.మమత, పినపాక వి.రమేష్ బాధ్యతలు చేపట్టారు.

కారేపల్లి: కారేపల్లి మండలానికి కేటాయించిన 15మంది జీపీవోలకు గాను మంగళవారం 10మంది జీపీవోలు తహసీల్దార్ ఎ.రమేష్ నుంచి బాధ్యతలు చేపట్టారు. మండలంలో మొత్తం 11క్లస్టర్లకు గాను 15మంది జీపీవోలను నియమించింది. వీరిలో ఉసిరికాయలపల్లి క్లస్టర్‌కు ముగ్గురు జీపీవోలు, బాజుమల్లాయిగూడెం, రేలకాయలపల్లికి ఇద్దరు చొప్పున నియమించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడు తూ విధినిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న అదనపు డీఎంహెచ్‌వో

వైరా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో వైరల్ జ్వరాలు ప్రబలకుండా నిలువరించేవిధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ సూచించారు. వైరా ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం అధికారులతో ఆయన సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొనేవిధంగా చూడాలన్నారు. ఎంపీడీవో సక్రియ, మండల వైద్యాధికారి డాక్టర్ బత్తినేని శ్రీహర్ష, సీహెచ్‌వో శాస్త్రీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డిపో అభివృద్ధి, సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక కృషి

» బదిలీ అయిన డీఎం రాజ్యలక్ష్మీకి సన్మానం

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 2022నుంచి సత్తుపల్లి ఆర్టీసీ డీఎంగా పనిచేసి కొత్తగూడెం డిపోకు బదిలీపై వెళ్లనున్న యు.రాజ్యలక్ష్మిని మంగళవారం రాత్రి ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, సిబ్బంది మాట్లాడుతూ ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు సత్తుపల్లి డిపో అభివృద్ధి, సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక కృషి చేసిన ఆమె ఆదర్శనీయమన్నారు. ఆర్టీసీ కుటుంబానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని, వరుసగా రెండేళ్ల పాటు సత్తుపల్లి డిపోను రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలిపారని, డిపో పరిధిలోని బస్టాండ్లను ఆధునీకరించడంతో పాటు బస్సులను ప్రయాణీకుల సౌకర్యార్థం పెంచేందుకు నిబద్ధతతో, నిజాయితీతో పనిచేశారని, ఇలాంటి విజయాలు మున్ముందు ఎన్నో అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిపో ఉద్యోగులు, సిబ్బంది, అద్దె బస్సుల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



డీఎం రాజ్యలక్ష్మిని సన్మానిస్తున్న ఉద్యోగులు

కార్యకర్తలకు అండగా ఉంటాం: నందిని

మధిర, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని అన్నారు. మంగళవారం మధిర లోని క్యాంపు కార్యాలయంలో మధిరకు చెందిన కార్ ఓనర్స్ డ్రైవర్లు అనేక మంది కాంగ్రెస్ పార్టీతో పాటు దాని అనుబంద కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీలో చేరారు. వారికి ఆమె పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేస్తున్న అభివృద్ధిని చూసి పలు గ్రామాల నుంచి ఇప్పటికే పెద్ద సంఖ్యలో పార్టీలో చేరారని, అనేక మంది పార్టీలో చేరటానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ నాయకులు నిడమానూరు వంశీ, కర్నాటి రామారావు, ఐఎన్‌టీయూసీ మండల పట్టణ అధ్యక్షుడు కోరంపల్లి చంటి, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లు నందిని

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

కల్లూరు, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులపైపెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కల్లూరులో మంగళవారం జర్నలిస్టుల మిత్రబృందం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వార్తా సేకరణకు వెళ్లిన జర్నలిస్టులపై అక్రమ కేసులను బనాయించడం తగదని పేర్కొన్నారు. సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్ కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె మునాఫ్, వేము రాంబాబు, ఎండి అబ్బాస్, గంగలు గోపి, చంటి, ధర్నాసి బాలరాజు, రోజ్‌వేణు, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లి: పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు, కంట్రీబ్యూటర్‌లపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ పెనుబల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ ఎస్వీనారాయణమూర్తికి ఒక వినతిపత్రం అందజేశారు. సమాజంలోని సమస్యలను ప్రభుత్వానికి వారధిగా పనిచేసే జర్నలిస్టులపై కేసులు పెట్టడం దారుణమని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నల్లమల అరుణప్రతాప్ పేర్కొన్నారు. జర్నలిస్టులు రవికుమార్, అశోక్‌కుమార్, షేక్.మీరా, కిరణ్‌కుమార్, షేక్.బాజీ పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

వైరా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైరాలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని పీటీఆర్‌లో మంగళవారం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే లైన్‌మెన్‌లు కర్లకంటి శ్రీనివాసరావు, పి.కృష్ణయ్యలు సకాలంలో స్పందించి మంటలను ఆర్పివేసి ఎలాంటి నష్టం జరగకుండా చేశారు. దాంతో పెనుప్రమాదం, భారీనష్టం తప్పిపోయింది. వీరి ధైర్యసాహసాలను వైరా ట్రాన్స్‌కో డీఈ బండి శ్రీనివాసరావు అభినందించారు. వెంటనే సబ్‌స్టేషన్‌కు చేరుకొని శ్రీనివాసరావు, కృష్ణయ్యలను డీఈ శ్రీనివాసరావు సన్మానించారు. ఏడీఈ పి.కిరణ్‌కుమార్, ఏఈ సుందర్‌కుమార్, సబ్ ఇంజనీర్లు నరేష్, సురేష్ పాల్గొన్నారు.

కుక్కల దాడి.. చుక్కల దుప్పికి చికిత్స

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో చుక్కల దుప్పి ఒకటి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం సత్తుపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. ఎఫ్ఎస్‌వో నరసింహ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక జేవీఆర్ ఓసీ ముఖద్వారం వద్దకు ఓ చుక్కల దుప్పిని కుక్కలు తరుముకుంటూ వచ్చాయి. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన ఆ దుప్పిని సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది ప్రథమ చికిత్స అనంతరం ఫారెస్ అధికారులకు అప్పగించారని తెలిపారు. దుప్పిని నీలాద్రి అర్బన్ పార్క్‌కు తరలించారు.

జాతీయ రహదారి డివైడర్‌పై గ్రిల్స్ తొలగింపు

పెనుబల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-ఛత్తీస్‌ఘడ్ జాతీయ రహదారిపై పెనుబల్లిలోని మసీదు రోడ్డు వద్ద యూటర్న్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో పలువురి ఫిర్యాదు మేరకు ఎన్‌హెచ్ అధికారులు మంగళవారం డివైడర్‌పై ఐరన్ గ్రిల్స్‌ను తొలగించారు. ఈ ప్రాంతంలో రెండు నెలల కాలంలో సుమారు పదిమంది రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. వీరిలో కొంతమందది మృత్యువాత కూడా పడ్డారు. ఈ నేపథ్యంలో డివైడర్‌పై ఉన్న ఐరన్ గ్రిల్స్‌ను తొలగించాలని పెనుబల్లి మాజీ సర్పంచ్ తేజావత్ తావునాయక్‌తోపాటు పలువురు ఎన్‌హెచ్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో డివైడర్‌పై ఉన్న ఐరన్ గ్రిల్స్‌ను తొలగించారు. దీంతోనైనా ప్రమాదాలు తగ్గుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రేజర్లలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేజర్లలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంతో పాటు పట్టణంలోని శ్రీ గీతాజ్ఞాన మందిరంలో మంగళవారం రాత్రి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూజా కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రముఖ ప్రవచనకర్త శ్రీమాన్ రామకృష్ణమాచార్య తెలిపారు. కార్యక్రమంలో భీమిరెడ్డి నరసింహారెడ్డి, ఒగ్గు పుల్లారెడ్డి, బొల్లారెడ్డి, సత్యనారాయణరెడ్డి, వసంతలక్ష్మీ, గొర్ల అంజిరెడ్డి, రాఘవరెడ్డి, ఎరసాని కేశవరెడ్డి, తిరునగరి వెంకటనర్సయ్య, గుడివాడ వీరవెంకటేశ్వరరావు, రాంబాబు తదితరులున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాడాలి: సీపీఎం

వైరా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సన్నద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీ బొంతు సమత అధ్యక్షతన మంగళవారం వైరాలో జరిగిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. బుధవారం ఖమ్మంలో జరిగే తెలంగాణ వారోత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వైరా మునిసిపాలిటీ పరిధిలో ప్రజాసమస్యలపై సీపీఎం నిర్వహించిన సర్వేలో వెలుగులోకి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, వాటి పరిష్కారం కోసం ప్రజలను సమీకరించి పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, నాయకులు సుంకర సుధాకర్, మచ్చా మణి, గుడిమెట్ల రజిత, మోహన్‌రావు, పైడిపల్లి సాంబశివరావు, కొంగర సుధాకర్, షేక్.నాగూల్‌పాషా పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సభలను జయప్రదం చేయండి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని గొరిల్లా పార్క్ పక్కన అంబేద్కర్ భవనంలో ఈనెల 20న నిర్వహించే మునిసిపల్ కార్మికుల జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఖమ్మం కార్పొరేటర్ బీజీ.క్లైమెంట్ పిలుపునిచ్చారు. మంగళవారం సత్తుపల్లి మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో ఆయన మా ట్లాడారు. కార్యక్రమంలో నిమ్మటూరి రామకృష్ణ, తడికమళ్ల యోబు, బుర్రి ఉపేందర్‌రెడ్డి, తాటి నాగేంద్రబాబు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో మాట్లాడుతున్న క్లైమెంట్

కల్లూరు: ఖమ్మంలో ఈ నెల 20న జరగనున్న మునిసిపాలిటీ కార్మికుల జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు క్లైమెంట్ పిలుపునిచ్చారు. కల్లూరులో మంగళవారం జరిగిన మునిసిపాలిటీ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, సీపీఐ మండల కార్యదర్శి దమాల దయాకర్‌రావు, ఊడల కృష్ణమూర్తి, చింతపల్లి శ్రీను పాల్గొన్నారు.

వైరాలో డంపింగ్‌యార్డ్ స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

వైరా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలో డంపింగ్‌యార్డు ఏర్పాటు కోసం అవసరమైన స్థలాన్ని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మంగళవారం పలుచోట్ల పరిశీలించారు. కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్, వైరా, తల్లాడ, కొణిజర్ల తహసీల్దార్లు కేవీ.శ్రీనివాసరావు, సురేష్, అరుణతో కలిసి పలుచోట్ల ఉన్న స్థలాలను పరిశీలించారు. గత ఐదేళ్ల కిందట రిజర్వాయర్ అలుగుల సమీపంలో తల్లాడ మండలం కొడవటిమెట్ట రెవెన్యూ పరిధిలో డంపింగ్‌యార్డు కోసం గుర్తించిన స్థలాన్ని పరిశీలించారు. వైరా నదిలో నీటి ప్రవాహం ఉన్నందున మునిసిపాలిటీ చెత్త వాహనాల రాకపోకలకు ఈ స్థలం అనువైనది కాదని అభిప్రాయపడ్డారు. ఆతర్వాత కొణిజర్ల మం డల పరిధిలోని పల్లిపాడులో ఉన్న 1.36ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. మునిసిపల్ కమిషనర్ గురులింగం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరన్న పాల్గొన్నారు.

అడ్డుకుంటే.. ఆగుతుందా?

(5వ పేజీ తరువాయి)

వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. ఈ క్రమంలో మార్చి నుంచి ఇసుక అక్రమ రవాణాపై పలు మార్లు కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే.

ఏపీలోని చింతలపూడిలో పెద్ద సంఖ్యలో ఇసుక వాహనాలు పట్టుబడటం సంచలనమే అయినా దీనిని ఇసుకాసురులు అంత సీరియస్‌గా తీసుకోవటం లేదనే ప్రచారం జరుగుతోంది. కొంత మేర ఇసుక అక్రమ రవాణాకు తాత్కాలికంగా బ్రేక్ పడిందని అంటున్నా.. ఇప్పటి వరకూ భారీ లాభాలకు అలవాటు పడిన అక్రమార్కులు తమకు సత్తుపల్లి నియోజకవర్గంలో సహకరిస్తూ వస్తున్న అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో తిరిగి కొనసాగించాలనే నిర్ణయించినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఓ నాయకుడు ఇసుక అక్రమార్కులకు కొమ్ము కాస్తూ అధికారుల వద్ద తన పలుకుబడి ఉపయోగించి పట్టుబడిన లారీలను విడిపించటం, కొన్ని వాహనాలకు రక్షణ కల్పించడం లాంటివి చేస్తున్నాడని సమాచారం. ఆ నాయకుడు చివరకు తానే బినామీ పేర్లతో లారీలు కొని ఇసుక వ్యాపారంలోకి దిగినట్టు ప్రచారం జరుగుతోంది.

అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

తెలంగాణలోని పలు జిల్లాలకు నిత్యం ఏపీ నుంచి సత్తుపల్లి నియోజకవర్గం మీదుగా వాహనాలు తరలిపోతున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరించటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. సత్తుపల్లి మండలంలోకి వాహనం ప్రవేశించి-తల్లాడ మండలం దాటే వరకూ సుమారు 75కిలో మీటర్లు ఉండగా.. ఆ వాహనాలు దర్జాగా రాకపోకలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీని వెనుక.. ఆర్థిక లావాదేవీలు, రాజకీయ ప్రమేయం పెద్దఎత్తున ఉండటమే కారణమని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో అధికారులు మాత్రం తమకు ఫిర్యాదు అందటం లేదని, సమాచారమిస్తే కఠినంగా వ్యవహరిస్తామంటూ మాటలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలున్నాయి.

మొక్కుబడిగా దాడులు

ఇటీవల కాలంలో అక్రమ ఇసుక లారీలు పట్టుకుంటున్నా కేవలం మొక్కుబడిగా జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక అక్రమ వ్యాపారుల్లో పోటీ పెరిగి వారిలో వారు ఫిర్యాదు చేసుకున్నప్పుడు మాత్రమే లారీలు పట్టుపడుతున్నాయని చెబుతున్నారు. దీనికి తోడు పట్టుకున్న లారీలకు సంబంధించి జరిమానాల విషయంలో కూడా చూసీచూడనట్టు వ్యవహరించటం, పట్టుకున్న ఇసుకను కొద్ది మొత్తంలో డంప్ చేయించి కొంత లారీల్లోనే వదిలేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

సెటిల్‌మెంట్లతో చెక్...

ఇసుక అక్రమ వ్యాపారానికి అడ్డు రాకుండా కొందరు .. 'తిలాపాపం తలా పిడికెడు' అన్న చందంగా ఆర్థిక ప్రలోభాలకు లొంగిపోగా.. కొన్ని కీలక వ్యవస్థలో ఉన్న వారు కూడా తమ సంపాదనే ధ్యేయంగా తమ విశ్వరూపం ప్రదర్శిస్తున్నారు. ఇసుక లారీలు వస్తున్నాయనే సమాచారంతో సరిహద్దుల్లోకి వెళ్లి మరీ డిమాండ్ చేసి మరీ డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఎవరి స్థాయిని బట్టి వారు అక్రమ ఇసుక నుంచి కరెన్సీ పిండుకుంటున్నారు. అక్రమ వ్యాపారులు కూడా ఇదే అదనుగా భావించి వారందరినీ సెటిల్‌మెంట్లతో లొంగదీసుకుంటున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

ఏన్కూరు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్ బీ పడాయిపై శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ భవాని, రమణ, బక్కమ్మ, నీహాల్ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెనుబల్లి: అంగన్‌వాడీ టీచర్లకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో టేకులపల్లి మోడల్ స్కూల్లో పోషణ్‌బీ...పడాయ్‌బీ కార్యక్రమంపై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని కల్లూరు సీడీపీవో నిర్మలజ్యోతి మంగళవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో టీచర్లకు ప్రీస్కూల్, పోషణ, దివ్యాంగ పిల్లల అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మీ, హైమావతి, అనురాధ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ముదిగొండ: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం, పిల్లలకు ఇవ్వాల్సిన ప్రేరణ గురించి అంగన్‌వాడీ టీచర్లకు మూడురోజులుగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడోరోజు మంగళవారం సీడీపీవో కమలప్రియ పాల్గొని పోషణ్‌బీ...పడాయ్‌బీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శారదాశాంతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉమారాణి, షకీరా, రాజకుమారి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



పెనుబల్లిలో మాట్లాడుతున్న సీడీపీవో నిర్మలజ్యోతి

డెంగీ నివారణకు చర్యలు

ఏన్కూరు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): డెంగీ నివారణకు చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఈవో నాగపద్మజ తెలిపారు. ఏన్కూరు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. అనంతరం డెంగీ కేసులు నమోదయిన పైనంపల్లితండాను సందర్శించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో రంజిత్‌కుమార్, వైద్యాధికారులు రాములు, మౌనిక తదితరులు పాల్గొన్నారు

విద్యాభివృద్ధికి రంగారావు కృషి అమోఘం

తల్లాడ, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతంలో విద్యాభివృద్ధికి కేసీఎం విద్యాసంస్థల వ్యవస్థాపకుడు అమరజీవి కోటగిరి రంగారావు కృషి అమోఘమని మాజీ జడ్పీటీసీ తాతా భాస్కరరావు అన్నారు. మంగళవారం స్థానిక బాలభారతి విద్యాలయంలో రంగారావు వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు విద్యా, వైజ్ఞానిక పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కేసీఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, డైరెక్టర్ శ్రావణి, ప్రిన్సిపాల్ తాల్లూరి రామారావు, హైమాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.